విశాఖపట్టణం
శుక్రవారం 7 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com   సంపుటి: 9   సంచిక:195   వెల: రూ.5/-   పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# రచ్చ.. రచ్చ..!

**వైసీపీ-టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ**

**విజయవాడ సెంట్రల్‌లో రాజకీయ ఉద్రిక్తత**

**డీఎస్సీ రిలే దీక్షల్లో ఇరువర్గాల పరస్పరం తోపులాట**



2



# ట్విన్ టవర్స్ రూ.1,002.49 కోట్లు

**ఎల్ అండ్ టీ నిర్మాణ బాధ్యతలు**

**అసెంబ్లీ, హైకోర్టు నూతన డిజైన్లకు నిధులు**

**అమరావతి ఐ ప్రాజెక్టుకు రీ టెండర్లు**

**దిశ చట్టం, భూ ఆక్రమణ బిల్లు ఉపసంహరణ**

**34 అజెండా అంశాకు గ్రీన్ సిగ్నల్.. కేబినెట్ బేటీలో కీలక నిర్ణయాలు**

**(అమరావతి - జయజయహే)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర పడింది. మొత్తం 34 కీలక అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన క్యాబినెట్, రాష్ట్ర అభివృద్ధి, పాలనా సంస్కరణలకు బాటలు వేసే ..మిగతా 2లో

## నేడు నేతన్న సేవలో ఒక్కో కుటుంబానికి రూ. 25 వేలు

**రూ.179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి**

**చీరాల సభలో విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు**

2

# ‘క్యా బోల్తీ పబ్లిక్’

## సీజేపీ దేశవ్యాప్త ప్రచారం.. క్షేత్రస్థాయిలోకి అభిజీత్ దిప్కే

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ ఇబ్బందులు, వాస్తవ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే గురువారం రోజున ‘క్యా బోల్తీ పబ్లిక్’ పేరుతో కొత్త దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రచారంలో ‘విద్యా సంస్కరణలు’ అనే అంశానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో విద్య అనేది సామాన్యుడికి అందుబాటులో లేకుండా, అత్యంత ఖరీదైనదిగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.





“మొదటి తరగతి చదివించేందుకే ఏటా దాదాపు రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇది కాకుండా డొనేషన్ల పేరిట అదనపు బాదుడు కొనసాగుతోంది. అంత ఆదాయం లేని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఈ డబ్బును ఎక్కడి నుంచి తెస్తాయి?” అని ఆయన ప్రశ్నించారు. కాలేజీ ఫీజులు, కోచింగ్ సెంటర్ల రుసుములు ఆకాశాన్ని తాకుతుండటంతో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు భారీగా అప్పులపాలు అవుతున్నారన్నారు. ఈ ఆర్థిక భారం నుంచి కుటుంబాలను విముక్తి చేయడమే తమ పార్టీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో విద్యను ఒక ప్రాథమిక హక్కుగా అందించారని, కానీ గత కొన్నేళ్లుగా విద్యను కేవలం లాభాలు గడించే ఒక పెద్ద వ్యాపారంగా మార్చేశారని విమర్శించారు. పిల్లలకు ఉన్నత విద్యను అందించడం తల్లిదండ్రులకు భారం కాకూడదని, విద్య ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా సమగ్ర మార్పులు తేవడమే తమ ‘క్యా బోల్తీ పబ్లిక్’ ప్రచారం ద్వారా లక్ష్యంగా పెట్టుకున్నామని దిప్కే పేర్కొన్నారు.

# యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు..?

**కేంద్రం బిల్లులకు లోక్ సభలో ఆమోదం**

**రుసుం వసూలు చేసే అధికారం బ్యాంక్ లు, చెల్లింపు సంస్థలకు**

**సామాన్యులపై భారం లేకుండా చూసే అవకాశం**

**భారీ లావాదేవీలపైనే చార్జీలకు యోచన**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

దేశంలో డిజిటల్ చెల్లింపుల ముఖచిత్రాన్ని మార్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. యూపీఐ , రూపే కార్డు లావాదేవీలపై ఛార్జీలు విధించేందుకు బ్యాంకులు, చెల్లింపుల సంస్థలకు వెసులుబాటు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ‘పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2026’ను లోక్‌సభ గురువారం ఆమోదించింది. విపక్షాల ఆందోళనల మధ్యే గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభమైన తర్వాత, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ..మిగతా 2లో



## వెన్నుపోటు పార్టీ గుండాల తీరు అత్యంత హేయం

**మల్లాది విష్ణుపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి ఉన్మాదానికి పరాకాష్ట**

**అప్రజాస్వామికంగా శిబిరాల తొలగింపు, దాడుల పర్వం**

**దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి**

**బాధ్యులను కఠినంగా శిక్షించాలి**

**మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్**

2

## ఆదివాసీల పోరాటానికి వైఎస్సార్‌సీపీ సంఘీభావం

**నిరసన ర్యాలీలు, బంద్ కు సంపూర్ణ మద్దతు**

**జీవో నెం.3కు శాశ్వత పరిష్కారం ప్రెషిడెన్షియల్ ఆర్డర్**

**ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ తీర్మానం చేయించి కేంద్రానికి ప్రతిపాదించాలి**

**లేకుంటే గిరజనులు రాష్ట్ర వ్యాప్తంగా భగ్గుమంటారు**

**ఎమ్మెల్సీ కుంభా రవిబాబు హెచ్చరిక**

2



## ఖర్చు రూ. 482.92 కోట్లు.. పెట్టుబడులు రూ.31.69 లక్షల కోట్లు

**ప్రధాని మోడీ పర్యటనల ఖర్చు లెక్కలు వెల్లడి**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు సంబంధించిన వివరాలను తాజాగా విదేశాంగ శాఖ వెల్లడించింది. 2021 నుంచి 2025 డిసెంబర్ వరకు ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై మొత్తం రూ.482.92 కోట్లు ఖర్చు అయ్యాయి. అదే సమయంలో భారత్‌కు 381.8 బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంటే భారతీయ కరెన్సీలో సుమారు రూ.31.69 లక్షల కోట్లు. ప్రధాని విదేశీ పర్యటనలపై ఖర్చు చేసిన ఒక్కో రూపాయికి సుమారు రూ.66 వేలు విలువైన ఎఫ్‌డీఐలు భారత్‌కు వచ్చినట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాని ..మిగతా 3లో

## పర్యావరణ ప్రతిపాదనలు వెనక్కి

**పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కమిటీ షాక్**

**శాస్త్రీయ అధ్యయానం చేయాలని సూచన**

**సముద్రంలో కలుస్తున్న నీటిని వాడుతాం- ఏపీ**

**తత్కాలికంగా బనకచర్ల పనులకు బ్రేక్**




**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం--బనకచర్ల నదుల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల అంచనాల కమిటీ షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనలను కేంద్రం వెనక్కి పంపింది. గోదావరి నది నుంచి పెన్నా బేసిన్‌కు నీటిని తరలించేలా రూ. 81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేసిన ఈ డ్రీమ్ ప్రాజెక్టు ప్రాథమిక దశలోనే నిలిచిపోవడం రాష్ట్ర జలవనరుల శాఖకు తీవ్ర ప్రతిబంధకంగా మారింది.

ఈ ప్రతిపాదనను తిరస్కరించడానికి ప్రధానంగా అంతర్రాష్ట్ర వివాదాలు, చట్టపరమైన చిక్కులే కారణమని ఈఏసీ వెల్లడించింది. ఈ ప్రాజెక్టు డిజైన్ 1980 నాటి గోదావరి ..మిగతా 2లో

## ఎన్ఆర్ఐ మహిళను వేధించిన మంత్రిని బర్తరఫ్ చేయాలి



**చాట్‌లు, ఫోటోల ఆధారంగా ఫోరెన్సిక్ విచారణ జరిపించాలి**

**అపాయింట్‌మెంట్ కోరిన మహిళకు ఫొటోలు పంపి వేధించడం సిగ్గుచేటు**

**ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ధ్వజం**

2

# రచ్చ.. రచ్చ..! వైసీపీ - టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ

### విజయవాడ సెంట్రల్ లో రాజకీయ ఉద్రిక్తత

### డీఎస్సీ రిలే దీక్షల్లో ఇరువర్గాల పరస్పరం తోపులాట

(విజయవాడ - జయజయహే)



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ వద్ద వైసీపీ వర్గాలు నిర్వహిస్తున్న ధర్నాను స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు నేతృత్వంలో టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. వైసీపీ కార్యకర్తలు ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో టెంట్లు వేసి ధర్నా చేపట్టారు. ఇది అనధికారికమని, ధర్నా చౌక్ వదిలి ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్డుపై టెంట్లు వేశారని ఎమ్మెల్యో బోండా ఉమ మండిపడ్డారు. టీడీపీ కార్యకర్తలు వైసీపీ టెంట్లను తొలగించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. విజయవాడ సెంట్రల్ సహా యాడికి, పొన్నూరులోనూ వైసీపీ ధర్నా చేస్తున్న టెంట్లు తొలగించారు. ఇరు వర్గాలు కుర్చీలు, టమాటాలు, కోడిగుడ్లు విసురుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో దీక్ష చేసే హక్కు లేదా? తమపై దాడులు ఎంత వరకు సబబు, రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని మండిపడ్డాపు వైసీపీ నేత మల్లాది విష్ణు. రాష్ట్రంలో శాంతి, భద్రతలు క్షీణించాయని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఈ దాడులేంటని ప్రశ్నించారు. ధర్నా చేసేందుకు ఇక్కడ అనుమతి లేదు, రోడ్డుపై టెంట్ వేసి ధర్నాలు ఏంటని ప్రశ్నించారు ఎమ్మెల్యే బోండా ఉమ. ముఖ్యమంత్రి చంద్రబాబుపై, మంత్రి లోకేష్ పై అనవసర విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు బోండా ఉమ. గత ప్రభుత్వం యువతను మోసం చేసింది..వాళ్లు కల్పించలేని ఉద్యోగాలు ఈ ప్రభుత్వం ఇచ్చిందని స్పష్టం చేశారు బోండా ఉమ. 18వేల మంది డీఎస్సీ పరీక్ష రాసి ఉద్యోగం సంపాదిస్తే వారి జీవితాలు నాశనం చేసేందుకు వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. డీఎస్సీ నిర్వహణ, పారదర్శకతపై చర్చించేందుకు రావాలని మంత్రి లోకేష్ సవాల్ విసిరారు..దానిపై చర్చించే దమ్ము, ధైర్యం జగన్ పార్టీ నేతలకు లేదు..ఇంకోసారి అబద్ధాలు ప్రచారం చేస్తే ఇంటికొచ్చి కొడతాం అని హెచ్చరించారు బోండా ఉమ. ధర్నా చౌక్ లో ఆందోళన చేసి ఉంటే తాము అడ్డుకునేవారం కాదని స్పష్టం చేశారు.

**రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారు-పేర్నినాని**

వైఎస్సార్ సీపీ దీక్షా శిబిరంపై టీడీపీ వర్గాల దాడి ఘటనపై తీవ్రస్థాయితో విరుచుకుపడ్డారు మాజీ మంత్రి పేర్ని నాని. చంద్రబాబు ప్రభుత్వానికి నూకలు చెల్లాయ్..రౌడీయిజానికి ప్రజలు త్వరలోనే సమాధానం చెబుతారు అన్నారు. బోండా ఉమ అధికారమదంతో..మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శిబిరంపై దాడి చేశారని..అధికారపార్టీ నేతలు రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. బోండా ఉమ లాంటి వందమంది రౌడీలను పోగేసుకుని చంద్రబాబు, లోకేశ్ శునకానందం పొందినా ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవదని, శిశుపాలుడి పాపాల మాదిరిగా లెక్కిస్తున్నారు ప్రజలు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు పేర్ని నాని. ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఇంటికొచ్చి కొడతాం అని బెదిరిస్తున్నారు..మీకు చేతనైంది చేసుకోండి ఎంతమందిని కొడతారో చూస్తాం అని సవాల్ విసిరారు నాని.

### ఆదివాసీల పోరాటానికి

## వైఎస్సార్ సీపీ సంఘీభావం

(తాడేపల్లి - జయజయహే)

రాష్ట్రంలోని ఆదివాసీ సంఘాలు జీవో నెం.3కు శాశ్వత పరిష్కారం, 170 చట్టం పరిరక్షణ కోసం చేపడుతున్న ఉద్యమాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉ ంటుందని రవిబాబు ప్రకటించారు. గిరిజనుల రాజ్యాంగ హక్కులను కాపాడడం కోసం ఆదివాసీలుకు తాము అండగా ఉంటామని ఆయన స్పష్టం చేసారు. తమ హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 7న గిరిజన ప్రాంతాల్లో ర్యాలీలకు, 8న రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చేపట్టనున్న బంద్ కు వైఎస్సార్ సీపీ పూర్తి సంఘీభావం తెలుపుతోందని, అలాగే గిరిజనులకు అండగా ఉంటామని ఆయన వెల్లడించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజన హక్కుల పరిరక్షణలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, జీవో నెం.3, 1/70 చట్ట పరిరక్షణ అంశంపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు విస్మరించారని మండిపడ్డారు. రెండున్నర సంవత్సరాలు గడిచినా కనీసం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. గిరిజన భూములను రక్షించే 170 చట్టంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలై నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఇంప్లీడ్ కాకపోవడం అనుమానాలకు తావిస్తోందని రవిబాబు వివరించారు. అంతేగాక మరోవైపు గిరిజనేతరులకు ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం గిరిజనుల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తోందని ధ్వజమెత్తారు. జీవో నెం.3పై తాత్కాలిక జీఓలు సరికాదని, రాజ్యాంగ బద్ధమైన ప్రెషిడెన్షియల్ ఆర్డర్ ను తీసుకురావాలని కుంభా రవిబాబు డిమాండ్ చేసారు. లేకుంటే గిరిజన ప్రాంతాలు భగ్గుమంటాయని హెచ్చరించారు.

## ట్విన్ టవర్స్ రూ.1,002.49 కోట్లు

మొదటి పేజీ తరువాయి...

పలు బిల్లులు, పాలసీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలను మంత్రివర్గం ఆమోదించింది. అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ ప్రాజెక్టుకు రూ.1,002.49 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ సమ్మతించింది. ఈ నిర్మాణ బాధ్యతలను ప్రముఖ సంస్థ ఎల్అండ్‌టీకి అప్పగించాలని నిర్ణయించారు. అసెంబ్లీ, హైకోర్టు భవనాల నూతన డిజైన్ల కోసం అదనపు నిధుల కేటాయింపునకు ఆమోదం లభించింది. అమరావతి ఐ ప్రాజెక్టుకు సంబంధించి కొత్తగా రీ-టెండర్లు పిలవాలని ఆదేశించింది. అమరావతి ప్రాంతంలో భూముల కేటాయింపులపై మంత్రుల బృందం చేసిన సిఫార్సులకు మంత్రివర్గం సమ్మతి తెలిపింది. అంతేకాదు గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ (భూ ఆక్రమణల నిరోధక) బిల్లు-2024లను ఉపసంహరించుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజలకు మరింత మేలు చేకూర్చేలా, భూ ఆక్రమణలు, మహిళల రక్షణపై మరింత పటిష్ఠమైన నూతన చట్టాలను రూపొందించడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026తో పాటు ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాలకు ఆమోదం తెలిపారు. పాదచారుల ప్రాణ రక్షణ కోసం ప్రత్యేకంగా పాదచారుల భద్రత పాలసీ-2026 అమలుకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జిల్లాలకు అనుగుణంగా విద్యా పరిపాలనను వేగవంతం చేసేందుకు 15 కొత్త డీఈవో పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మంత్రివర్గం. రాష్ట్రంలో ఉన్నత విద్యను మరింత విస్తరించేందుకు మరో రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతినిచ్చారు. దీనితో పాటు మున్సిపాలిటీలకు చెందిన భూముల లీజు గడువును పెంచేందుకు చట్టసవరణలు చేయడం, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలకు కూడా ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

### నేడు నేతన్న సేవలో

## ఒక్కో కుటుంబానికి రూ. 25 వేలు

(అమరావతి - జయజయహే)

చేనేతలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 'నేతన్న సేవలో' పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు అందజేయనుంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిధులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. రూ.179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. చీరాలలో సీఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. వేటపాలెం మండలం కొత్తపేటలో చేనేత దినోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారు. నేతన్న సేవలో పథకం ద్వారా చేనేతల ఖాతాలకు రూ.5 వేలు నగదు బదిలీ చేయనున్నారు. చీరాల మండలం జాండ్రపేటలో చేనేత మగ్గాలను పరిశీలించి లబ్ధిదారులతో ముఖాముఖిలో మాట్లాడనున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 10:30 గంటలకు ఉ ండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా కొత్తపేట బయలుదేరనున్నారు. 10:50లకు కొత్తపేటకు సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. 11:05 నుంచి 12:35 వరకు ప్రజా వేదికలో పాల్గొంటారు. ప్రజా వేదిక సభలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభిస్తారు. చేనేతల ఖాతాలకు రూ.25 వేల చొప్పున నగదు బదిలీ చేస్తారు. 1:20లకు చీరాల మండలం జాండ్రపేటలో మగ్గాలను పరిశీలించి చేనేతలతో మాట్లాడుతారు. 2:30కి చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 4.25కి కొత్తపేట నుంచి హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు ఉండవల్లి బయలుదేరి వెళ్లనున్నారు.



### వెన్నుపోటు పార్టీ గుండాల తీరు

## అత్యంత హేయం

(విశాఖపట్నం - జయజయహే)

శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వైయస్సార్‌సీపీ శ్రేణులపై అధికార వెన్నుపోటు పార్టీ దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండలి విపక్ష నేత బొత్స సత్యనారయణ ఆగ్రహం వ్యక్తం చేసారు. . విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నిర్వహిస్తున్న దీక్షా శిబిరంపైకి వెన్నుపోటు పార్టీ గుండాలు దూసుకొచ్చి టెంట్లు లాగిపడేసి, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడికి తెగబడడం అత్యంత హేయం. వారిని అడ్డుకోవాల్సిన పోలీసులు, తిరిగి మా పార్టీ నాయకులనే అరెస్టు చేశారు. మల్లాది విష్ణుగారిని పోలీస్ వ్యాన్‌లో తరలిస్తుండగా, వెన్నుపోటు పార్టీ మహిళా కార్యకర్త ఒకరు పార్టీ జెండా కర్రతో ఆయనపై దాడి చేయడం, రాష్ట్రంలో పూర్తిగా దిగజారిన శాంతి భద్రతలకు, పోలీస్ వ్యవస్థ దిగజారుడుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇంకా విజయవాడలో దీక్షా శిబిరంలోని టెంట్‌పై వెన్నుపోటు పార్టీ కార్యకర్త ఒకరు మూత్ర విసర్జన చేయడం ఆ పార్టీ ఉన్మాద ఆలోచనలకు, వారి చేష్టలకు అద్దం పడుతోంది. ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న నిరసనలను అణచి వేయాలని వెన్నుపోటు పార్టీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు అని బొత్స ఆక్షేపించారు. డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించడంతో పాటు, ఆ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి. ఇదే అంశంపై వైయస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలపై వెన్నుపోటు పార్టీ నేతలు దాడులకు పాల్పడ్డారు. ఇంకా చాలాచోట్ల పోలీసులను ఉపయోగించి, దీక్షా శిబిరాలు ధ్వంసం చేశారు. వెన్నుపోటు పార్టీ చేస్తున్న ఈ అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. మాపై ఎన్ని దౌర్జన్యాలు చేసినా, మా ఆందోళన బాట వీడబోము. మా పోరాటం కొనసాగుతుంది. అలాగే ఇప్పుడు దాడి చేసిన వారందరిపై వెంటనే కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేసారు.

## పర్యావరణ ప్రతిపాదనలు వెనక్కి

మొదటి పేజీ తరువాయి...

జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా ఉందంటూ వచ్చిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిగణనలోకి తీసుకుంది. గోదావరి వరద జలాల మళ్లింపు వల్ల ఎగువన ఉన్న తెలంగాణతో పాటు, ముంపు ముప్పు ఎదురయ్యే అవకాశం ఉందంటూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజన దెబ్బతింటాయన్న అభ్యంతరాలు వచ్చాయి. ఈ కారణంగా ఈ ప్రాజెక్టుపై ముందుగా సమగ్ర అధ్యయనం అవసరమని స్పష్టం చేసింది.

**శాస్త్రీయంగా అధ్యయనానికి సూచన**

వరద జలాల లభ్యతపై కేంద్ర జల సంఘం ద్వారా శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని ఏపీ ప్రభుత్వానికి కేంద్రం సూచించింది. గోదావరి బేసిన్‌లో అసలు మిగులు జలాలు ఎంతమేరకు అందుబాటులో ఉన్నాయో సవివరమైన నివేదిక రూపొందించాలని పేర్కొంది. అంతేకాకుండా, పొరుగు రాష్ట్రాలతో ఉన్న అంతర్రాష్ట్ర జల వివాదాలను సంప్రదింపుల ద్వారా లేదా చట్టబద్ధ వేదికలపై పరిష్కరించుకున్న తర్వాతే, పర్యావరణ అనుమతుల కోసం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**సముద్రంలో కలసిపోతున్న నీటిని వాడుకుంటామన్న ఏపీ**

సముద్రంలో వృథాగా కలిసిపోతున్న గోదావరి వరద నీటిలో దాదాపు 200 టీఎంసీలను రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల కరవు ప్రాంతాలకు మళ్లించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. దీనిద్వారా దాదాపు 80 లక్షల మంది ప్రజలకు సురక్షిత తాగునీరు లభించడమే కాకుండా, 3 లక్షల హెక్టార్ల దాదాపు 7.41 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టుకు సాగునీరు అందగలదని, మరో 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచించింది.

**తాత్కలికంగా బనకచర్లకు బ్రేక్**

కేంద్రం నుంచి వచ్చిన ఈ సాంకేతిక, చట్టపరమైన ప్రతిబంధకంతో పోలవరం--బనకచర్ల ప్రాజెక్టు పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అయితే, సిడబ్ల్యూసితో కలిసి వరద నీటి లభ్యత గణాంకాలను పక్కాగా సిద్ధం చేయడం, అంతర్రాష్ట్ర అభ్యంతరాలకు సంబంధించి న్యాయపరమైన వివరణలు ఇవ్వడం ద్వారా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఏపీ జలవనరుల శాఖ అధికారులు కసరత్తు వేగవంతం చేశారు.




## యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు..?

మొదటి పేజీ తరువాయి...

ఈ బిల్లుకు సభ మూజువాణి వోటుతో ఆమోదముద్ర వేసింది. భారతదేశాన్ని గ్లోబల్ క్యాపిటల్, తయారీ కేంద్రంగా మార్చే సువిశాల లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ బిల్లు.. గత జూన్ 5న కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను భర్తీ చేసింది. ప్రస్తుతం ఆర్టీజీఎస్ (, నెఫ్ట్ వంటి లావాదేవీలకు మాత్రమే బ్యాంకులు సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. యూపీఐ, రూపే లావాదేవీలు ఉచితంగా సాగుతున్నాయి. అయితే, ఈ బిల్లు ద్వారా 2007 నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం (సెక్షన్ 10ూా), ఆదాయపు పన్ను చట్టం-2025 (సెక్షన్ 269ూఖ) నిబంధనలను సవరించారు.

దీంతో ఏయే ఎలక్ట్రానిక్ చెల్లింపులు ఉచితంగా ఉండాలనేది ఇకపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ ద్వారా ప్రకటిస్తుంది. తాజా మార్పులతో భవిష్యత్తులో యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) వసూలు చేసేందుకు బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లకు చట్టబద్ధత లభించింది. వ్యక్తిగత చెల్లింపులకు (ూవవతీ-శీ-ూవవతీ) మినహాయింపు ఇచ్చి, కేవలం వ్యాపారులకు చేసే భారీ లావాదేవీలపై మాత్రమే ఈ ఛార్జీలు విధించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధింపుపై వస్తున్న వార్తలపై రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం స్పందించారు. దీనిపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "చెల్లింపుల మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా ఖర్చవుతుంది, ఆ ఖర్చును ఎవరో ఒకరు భరించాల్సిందే. పన్నుల రూపంలో సామాన్య ప్రజలే భరించడం లేదా వాడుకునే వారి నుంచే వసూలు చేయడం అనే రెండు మార్గాలు మన ముందు ఉన్నాయి. ప్రస్తుతానికి ప్రభుత్వం చట్ట సవరణ మాత్రమే చేసింది. డిజిటల్ వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే మా లక్ష్యం, తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూద్దాం" అని ఆర్బీఐ గవర్నర్ స్పష్టం చేశారు.



### ఎన్ఆర్ఐ మహిళను వేధించిన మంత్రిని

## బర్తరఫ్ చేయాలి

### చాట్‌లు, ఫోటోల ఆధారంగా ఫోరెన్సిక్ విచారణ జరిపించాలి

### అపాయింట్‌మెంట్ కోరిన మహిళకు ఫొటోలు పంపి వేధించడం సిగ్గుచేటు

### ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ధ్వజం

(విశాఖపట్నం - జయజయహే)

ఎన్ఆర్ఐ తెలుగు మహిళను వేధించిన మంత్రిని వెంటనే బర్తరఫ్ చేసి, చాట్‌లు, ఫోటోలు తదితర ఆధారాలపై ఫోరెన్సిక్ విచారణ జరిపించాలని వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. విశాఖలోని పార్టీ సిటీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 27 నెలలు గడిచినా రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై ఏ రకమైన వేధింపులు, అఘాయిత్యాలు జరిగినా అందులో కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలే ఉంటున్నారని మండిపడ్డారు. ఈ వేధింపుల సంస్కృతిని రాష్ట్రానికే పరిమితం చేయకుండా విదేశాలకు విస్తరింపజేశారని ధ్వజమెత్తారు. వెన్నుపోటు తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మంత్రి అమెరికాలోని డల్లాస్‌లో ఎన్ఆర్ఐ తెలుగు మహిళను వేధించారని సోషల్ మీడియాలో ఆరోపణలు వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాలకు సంబంధించిన అపాయింట్‌మెంట్ కోరిన మహిళను ఒంటరిగా కలవాలని మంత్రి కోరడం, అనుచితంగా ఫోటోలు పంపి వేధించిన విషయం తెలిసి కూడా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. బాధితురాలు నారా లోకేష్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బాధితురాలు చేసిన అన్ని ఆరోపణలపై కేసు నమోదు చేసి, నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఈ దారుణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే హోంమంత్రి అనితతో పాటు మహిళా మంత్రులు కూడా ఈ అంశంపై తమ వైఖరిని వెల్లడించాలని వరుదు కళ్యాణి కోరారు.

**డల్లాస్‌లో ఎన్ఆర్ఐ మహిళపై మంత్రి వేధింపులు**

అమెరికాలోని డల్లాస్‌లో ఒక టీడీపీ మంత్రి, 'ప్యూర్ సర్వీస్ ఆర్గనైజేషన్' ఫౌండర్, ఎన్ఆర్ఐ అయిన డాక్టర్ తాళ్లూరి శైలా అనే మహిళను తీవ్రంగా వేధించారు. సేవా కార్యక్రమాల నిమిత్తం అపాయింట్‌మెంట్ అడిగితే, ఒంటరిగా కాఫీ షాప్‌కి రమ్మని సదరు మంత్రి ఆమెపై ఒత్తిడి తెచ్చారు. తన అసభ్యకరమైన ఫోటోలను సైతం ఆమెకు పంపారు. మంత్రి బారి నుంచి తప్పించుకోవడానికి ఆ మహిళ ఎప్పుడో చనిపోయిన తన పెదనాన్న పేరును వాడుకోవాల్సి రావడం అత్యంత దారుణం. ఫిర్యాదు చేసిన ఎన్ఆర్ఐ మహిళపై సోషల్ మీడియాలో ట్రోలింగ్, వేధింపులు జరుగుతున్నాయి. బాధితురాలికి రక్షణ కల్పించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలు అని ఆమె డిమాండ్ చేసారు.

# దగా డీఎస్సీపై ప్రజా పోరాటం

**విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రిలే నిరాహార దీక్షలు**

**కూటమి వల్ల డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం**

**లోకేష్ రాజీనామా వరకు మా పోరాటం ఆగదు**

**వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు**

**విశాఖపట్నం, ఆగష్టు 6, జయ జయహే**





డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరహార దీక్ష గురువారం సత్యం జంక్షన్ వద్ద చేపట్టారు. విశాఖ జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షలో విద్యార్థులు, యువత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ఈ రాష్టంలో మూడు లక్షలుకు పైగా నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షలు రాస్తే ఫలితాలు వచ్చిన తర్వాత జీవోలు మార్చి, ఫలితాలు చార్ట్ మార్చి కొత్తగా స్పోర్ట్స్ కోటా తీసుకువచ్చి కూటమి ప్రభుత్వము డీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకుందన్నారు. దగాపడ్డ ప్రతి డీఎస్సీ అభ్యర్థులు తరుపున, ఫీజు రీయంబర్స్మెంటు రాలేని విద్యార్థులు తరఫున మా నాయకుడు వై.యస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని..మరి ముఖ్యంగా డీఎస్సీలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహించి మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసే వరకు మా పోరాటము ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలో మాజీ కార్పొరేటర్లు సీఈసీ సభ్యులు, ఎస్ఈసీ సభ్యులు నియోజకవర్గ పరిశీలకులు సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు 14, 25, 26, 42, 43 వార్డుల వైసీపీ ప్రెసిడెంట్స్, సీనియర్ నాయకులు, మహిళలు, విద్యార్థులు యువత తదితరులు పాల్గొన్నారు.



## సౌండ్ రంగంలో సరికొత్త టెక్నాలజీ ప్రదర్శన ఆగస్టు 8న

**రాజమహేంద్రవరం: జయ జయహే**

ఆగస్టు 6 :విజయవాడకు చెందిన మెకోట్రానిక్స్ సంస్థ, ది రాజమండ్రి సౌండ్ ౘ లైటింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 8న దివాన్ చెరువులోని ఎస్విపిసి కన్వెన్షన్ హాల్‌లో నూతన సౌండ్ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గుల్లిపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం తిలక్ రోడ్‌లోని సత్యా సౌండ్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.యేరుకొండ సౌండ్ సిస్టమ్, శ్రీ అంజనాద్రి ఎలక్ట్రానిక్స్, శ్రీ నారాయణ ఎలక్ట్రానిక్స్, ఆదిత్య ఎలక్ట్రానిక్స్ సంస్థలు ప్రదర్శనలో పాల్గొంటాయని తెలిపారు. సౌండ్ రంగంలో వస్తున్న అత్యాధునిక సాంకేతికతను పరిచయం చేసే ఈ ప్రదర్శనను కోనసీమ, కాకినాడ, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో అ...

## ఖర్చు రూ. 482.92 కోట్లు.. పెట్టుబడులు రూ.31.69 లక్షల కోట్లు

**మొదటి పేజీ తరువాయి...**

నరేంద్ర మోదీ 2021 నుంచి ఇప్పటివరకు ఏయే దేశాల్లో పర్యటించారు? ఒక్కో దేశ పర్యటనకు అయిన ఖర్చు ఎంత? తదితర వివరాల గురించి రాజ్యసభ సభ్యులు అడిగిన ప్రశ్నలకు విదేశాంగశాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా సమాధానం ఇచ్చారు. మంత్రి తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాని 2021లో చేసిన మూడు విదేశీ పర్యటనలకు రూ.36.12 కోట్లు ఖర్చు కాగా, 2022లో ఏడు పర్యటనలకు రూ.55.83 కోట్లు ఖర్చయింది. ఇక, 2023లో ఆరు పర్యటనలకు రూ.93.63 కోట్లు, 2024లో 11 పర్యటనలకు రూ.109.51 కోట్లు, 2025లో 11 పర్యటనలకు రూ.187.83 కోట్లు ఖర్చయ్యాయి. ఇక, 2026లో ఇప్పటివరకు ఆరు పర్యటనలపై రూ.74.59 కోట్ల వ్యయం అయినట్టు తెలిపారు.

## డాక్టర్ ప్రియాంకపై దాడి, బుజ్జిబాబు హత్యపై ఎంపీ పురందేశ్వరి దిగ్భ్రాంతి

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



రాజమహేంద్రవరంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంకపై కారుతో ఢీకొట్టి దాడి చేసిన ఘటనను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్రంగా ఖండించారు. యువ వైద్య విద్యార్థినిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తెలిపారు.నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఆమె కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు.అదేవిధంగా గోరక్షణపేటలో జరిగిన చెవ్వేటి బుజ్జిబాబు హత్య ఘటనను కూడా ఎంపీ ఖండించారు. నిందితులను అదుపులోకి తీసుకుని, పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ సూచించారు.




## నిడదవోలులో సులభ్ కాంప్లెక్సులు ఏర్పాటు చేయాలి

**పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలి: జువ్వల రాంబాబు**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడళ్లలో సులభ్ కాంప్లెక్సులు ఏర్పాటు చేయాలని నిడదవోలు పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఐ లవ్ నిడదవోలు సెంటర్, గణేష్ చౌక్, సంత మార్కెట్ ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్సులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతాలకు నిత్యం వేలాది మంది ప్రజలు, కార్మికులు, మహిళలు వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారని తెలిపారు.ముఖ్యంగా మహిళలకు మూత్ర విసర్జన కోసం సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం మున్సిపల్ అధికారుల కనీస బాధ్యత అని జువ్వల రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఐ లవ్ నిడదవోలు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ తాపీ పనివారుల సంఘం అధ్యక్షులు కారింకి వెంకటేశ్వరరావు, జిలానీ, వెంకటేశ్వరరావు, రాము, ముసలయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.ౚ



## సీటీయూఏపీ స్వాతంత్ర్య దినోత్సవ క్రీడా, సాంస్కృతిక పోటీల పోస్టర్ ఆవిష్కరణ

**విజయనగరం, ఆగస్టు 5,(జయ జయహే)**


కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ (సీటీయూఏపీ)లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించనున్న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బంది క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని జాతీయ భావన, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ (ఇన్‌చార్జ్) డా. శంకర్ రెడ్డి, ఆర్థిక అధికారి ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, డీన్ (విద్యార్థి సంక్షేమం) మరియు క్రీడా--సాంస్కృతిక కమిటీ చైర్మన్ డా. బొంతు కోటయ్య, కమిటీ సభ్యులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఆగస్టు 15 వరకు విద్యార్థులు, సిబ్బంది కోసం వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశ్వవిద్యాలయ కుటుంబ సభ్యులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## వినాయక చవితికి మట్టి విగ్రహాలను ఉపయోగించండి

**అనకాపల్లి జయ జయహే**

వినాయక చవితి రాబోతున్న సందర్భంగా ఈ సంవత్సరం కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని లక్ష్యంగా చేసుకుని అనకాపల్లి వినాయక నిమజ్జన కమిటీ అధ్యక్షుడు ఆడారి కుమార్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మట్టి విగ్రహాలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని ప్రతి ఇంట్లోని మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసుకున్నందుకు ప్రయత్నించాలని అలాగే అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రతి సంవత్సరం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందిస్తూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పిస్తున్నాయని దానిని ప్రతి ఒక్కరు ఆచరించాలని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత అని పేర్కొన్నారు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్న ఆడారి కుమార్ స్వచ్ఛంద సంస్థ లకు నా కృతజ్ఞతలు అని ఆయన తెలియజేశారు ప్రతి ఒక్కరు ప్లాస్ట ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడవద్దని వాటికి బదులు మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని అలాగే ఇతర దేవి దేవత పెద్ద విగ్రహాలు కూడా మట్టితో తయారుచేసినవే ఉపయోగించాలని ఆయన సూచించడం జరిగింది . పర్యావరణం పరిరక్షణ ఒక ధ్యేయంగా భావించే వినాయక చవితిని ప్రకృతికి మేలు చేసే విధంగా మనకు మేలు ఆనందంగా ఉండేలా ఈ పండుగను జరుపుకుందామని ఆయన పిలుపునిచ్చారు



## కాంగ్రెస్‌లో భారీ చేరికలు

**బిజెపి పతనం ప్రారంభమైంది.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్**

**అచ్చుతాపురం, ఆగస్టు 6, జయ జయహే:**

అచ్చుతాపురం మండలంలోని పూడిమడక గ్రామంలో సుమారు 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీకి తీర్థం పుచ్చుకున్నారు. ఎలమంచిలి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తనకాల అనంతరావు ఆధ్వర్యంలో గురువారం పూడిమడకలో జరిగిన సదస్సులో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మార్పు మొదలైందని రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేయడం జరుగుతుందని తెలిపారు. యువత అంతా రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ రాహుల్, మెరుగు అచ్చిబాబు, మలపరెడ్డి ఈశ్వరరావు, పట్టా రమణ, రావి రామసత్యం, దొడ్డి రవి, మంత్రి సాయి శాంతి, ఆర్ ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారికి ఆర్థిక సహాయం అందజేసిన కార్తీక్ ఫౌండేషన్

**కొల్లూరు జయజయహే న్యూస్:**




ఆగస్టు 06 బాపట్ల జిల్లా, కొల్లూరు మండలం తడికలపూడి గ్రామంలో యేమినేని వెంకటేశ్వరరావు, నాగ జ్యోతి లకు చెందిన పాప పూజశ్రీ (5సం) ఇటీవల వేడి నీళ్ల హీటర్ లో పడి శరీరానికి తీవ్రంగా గాయ పడింది కార్తీక్ ఫౌండేషన్ ఫౌండర్ కార్తీక్ పాప పూజశ్రీ ని పరామర్శించి దాతల సహకారంతో 15000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మరియు ఆరువేలు విలువ కలిగిన వైద్యానికి అవసరం అయ్యే మూడు డ్రెసింగ్ కిట్లు, విద్యకు అవసరం అయిన నోట్ బుక్స్, బ్యాగ్ ను, అందించారు.. ఈ సందర్భంగా కార్తీక్ ఫౌండేషన్ ఫౌండర్ నందూరి కార్తీక్ మాట్లాడుతూ కొల్లూరు మండలం తడికలపూడి గ్రామంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో శరీరం కాలిన పాప గురించి తెలుసుకుని, తమ బృందం మరియు, దాతల సహకారంతో సహకారాన్ని అందించామని తెలిపారు . పాపకు ఇలా జరగడం చాలా బాధాకరమైన సంఘటన అని ప్రమాదంలో శరీరం కాలిన పాపకు కార్తీక్ ఫౌండేషన్ సంస్థ అండగా ఉంటుందని తెలియజేసారు.. ఈ కార్యక్రమంలో, కార్తీక్ ఫౌండేషన్ టీమ్ తదితరులు పాల్గొన్నారు..



## మరిడిమాంబ అమ్మవారి పండుగ

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు**

**అచ్యుతాపురం, ఆగస్టు 6, జయ జయహే:**

అచ్చుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. మరిడిమాంబ అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే విజయ్ కుమార్ కు ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. పండుగ సందర్భంగా గ్రామంలో భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



## కీర్తిశేషులు మాజీ మున్సిపల్ చైర్మన్ రాంజీ విగ్రహావిష్కరణ చేసిన కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి ప్రజల ముద్దుబిడ్డ, అజాతశత్రువు స్నేహశీలి మాజీ మున్సిపల్ చైర్మన్ కీర్తిశేషులు కడిమిశెట్టి శ్రీరాములు (రాంజీ) జయంతి సందర్భంగా పట్టణ మెయిన్ రోడ్ లో పెరుగు బజార్ రాతి మేడ వద్ద ఆయన కాంస్య విగ్రహం అనకాపల్లి వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మాజీమంత్రి కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంజీ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు ప్రజల మనిషి అని కుల మత వర్గ పార్టీ విభేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ స్నేహితుడిగా తమ్ముడిగా అన్నయ్య గా నిలిచిన వ్యక్తి అని అందుకే ఆయనకు ప్రజల్లో ఎంతో మంచి పేరు విశేషమైన ప్రజా సంబంధాలు, రాజకీయ అనుబంధాలు అందరితో కలిసి మెలిసి ఉండేవారిని ముఖ్యంగా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతూ ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని ఇటువంటి నాయకులు సమాజానికి ఎంతో అవసరం అని భవిష్యత్ నాయకత్వానికి ఈయన ఒక ఆదర్శంగా నిలుస్తారని ఇలాంటి వారి జీవితం సమాజానికి అంకితం అని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సంఘ సభ్యులు వైశ్య సంఘ నాయకులు ప్రజా ప్రతినిధులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

For a pure tomorrow..

# జవాబుదారీతనం

మాట తేటతెల్లనైంది కావాలి...
వెలుగులో
చీకటిలో
కాలం ప్రశ్నించినప్పుడు
తలవంచని ధైర్యంగా మారాలి,
ప్రజల నమ్మకానికి ప్రతిరూపంగా నిలవాలి.

పనికి పవిత్రమైన మనసు
ముళ్లను తొలగించిన చేతి ఔన్నత్యం కావాలి.
పదవులు వచ్చి పోతాయి,
ప్రశంసలు గాలిలో కలిసిపోతాయి
కానీ స్వచ్ఛమైన సేవ
తరాల గుండెల్లో శిలాశాసనమే!

ఆలోచనకు సూచనకు
అంతరంగం సాక్ష్యం చెప్పాలి.
స్వార్థం నీడ పడని చోట
వివేకం మొలకెత్తాలి
అభిప్రాయం గెలుపుకు కాక
అందరి జీవితాల వెలుగుకు కావాలి!

మాటలతో మాయ చేయడం సులభమే,
కానీ మాటను నిలబెట్టడం మహోన్నతం.
ఒక వాగ్దానం వెనుక
వెయ్యి ఆశల ఊపిరి ఉంటుంది
ఒక నమ్మకం వెనుక
లక్షల గుండెల స్పందన ఉంటుంది.

జవాబుదారీతనం అంటే
మనిషి తన మనసుతో చేసుకునే ఒప్పందం.
ఎవరూ చూడని వేళలోనూ
నిజాయితీని కాపాడే జాగరణ.
చరిత్ర కోసం చేసే ప్రయాణం.

ప్రజల కన్నీటి బొట్టులో
తన ప్రతిబింబాన్ని
ప్రజల నవ్వులో
తన విజయాన్ని వెతికేవాడే నేత!



**డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల**

# పరిశోధన మార్గదర్శకాలా? మేధో స్వేచ్ఛకు సంకెళ్లా?

## ప్రపంచస్థాయి పరిశోధన... కానీ ఎక్కడ స్వేచ్ఛ?

**భారత్‌ను ప్రపంచ జ్ఞాన శక్తిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ ప్రకటిస్తున్నాయి. జాతీయ విద్యా విధానం (NEP-2020) నుంచి విశ్వవిద్యాలయాల కార్యాచరణ వరకు ప్రతిచోటా "నాణ్యమైన పరిశోధన", "ఆవిష్కరణ", "వినూత్నత" వంటి పదాలు మార్మోగుతున్నాయి. అయితే ఒక ప్రాథమిక ప్రశ్న మాత్రం ఇంకా సమాధానం కోసం ఎదురుచూస్తూనే ఉంది. మన విశ్వవిద్యాలయాల్లో పరిశోధనకు నిజంగా స్వేచ్ఛ ఉందా? లేక నియమాల పేరుతో సృజనాత్మకతను క్రమంగా నిర్బంధిస్తున్నామా?**



### పరిశోధన అంటే పునరావృతం కాదు

పరిశోధన అంటే పుస్తకాలలో ఉన్న విషయాలను మరోసారి సేకరించడం కాదు. కొత్త ప్రశ్నను అడగడం, కొత్త కోణాన్ని ప్రతిపాదించడం, ఇప్పటివరకు గుర్తించని సంబంధాలను వెలికితీయడం. ఒక డాక్టరేట్‌కు "హతీఅస్త్రఅఖ్రీ జశీఱతీఅ-ఎబ్అశీఅ్‌శీ ఖఅశీఒ్రీవసస్త్రవ" అనేది ప్రపంచవ్యాప్తంగా అంగీకరించిన ప్రమాణం. కానీ విచిత్రమేమిటంటే, మన పరిశోధనా వ్యవస్థలో కొత్త ఆలోచననే కొన్నిసార్లు అత్యంత ప్రమాదకరమైన అంశంగా పరిగణిస్తున్నారు.

### "ఇలా ఎవరూ చేయలేదు"---అది తిరస్కరణకు కారణమా?

పరిశోధన ప్రతిపాదనను సమర్పించిన అనేక మంది పరిశోధకులు ఒకే సమాధానాన్ని వింటుంటారు---"ఇలా ఇప్పటివరకు ఎవరూ చేయలేదు." ఈ వాక్యం వినడానికి సాధారణంగా అనిపించినా, దాని వెనుక ఒక పెద్ద ప్రశ్న దాగి ఉంది. ఎవరూ చేయని విషయాన్ని పరిశోధించకపోతే, కొత్త జ్ఞానం ఎలా పుడుతుంది?

### మార్గదర్శకాల అవసరం... అతిగా ఆధారపడటం సమస్య

విశ్వవిద్యాలయాలు ఞూూ, మీూూ, జష్ట్రఅఝ్తస్త్రశీ, ఝతీ-ఝతీవ, ×జుజుజు, ఝఅఒశీబజవతీ వంటి రచనా శైలులను అనుసరించడం సహజమే. ఇవి పరిశోధనలో ఏకరూపత, మూలాల పారదర్శకత, విద్యా నిజాయితీని కాపాడేందుకు అవసరమైన ప్రమాణాలు. ఈ ప్రమాణాల అవసరాన్ని ఎవరూ తిరస్కరించలేరు. కానీ అవి పరిశోధనను క్రమబద్ధం చేయడానికి ఉద్దేశించినవా? లేక పరిశోధకుడి ఆలోచనను నియంత్రించడానికా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

### నియమాలు ముందా? ఆవిష్కరణలు ముందా?

ఇటీవలి కాలంలో పరిశోధనలో ఒక విచిత్ర ధోరణి కనిపిస్తోంది. అంశం ఎంత కొత్తదన్న దానికంటే, మార్జిన్ ఎంత సరిగ్గా ఉందన్నదానిపై ఎక్కువ శ్రద్ధ. పరిశోధనా సమస్య ఎంత ప్రాముఖ్యమన్న దానికంటే, కామా ఎక్కడ పెట్టారన్నదానిపై ఎక్కువ చర్చ. సూచన గ్రంథాల జాబితా ఎలా ఉందో పరిశీలించేంత సమయం, పరిశోధనలోని కొత్త ఆలోచనను విశ్లేషించడానికి వెచ్చించకపోతే, పరిశోధన అసలు లక్ష్యం నెరవేరుతుందా?

చరిత్ర మనకు ఒక స్పష్టమైన పాఠం చెబుతోంది. ప్రపంచాన్ని మార్చిన ప్రతి ఆవిష్కరణ ఒకప్పుడు సంప్రదాయానికి భిన్నంగానే కనిపించింది. శాస్త్రంలోనైనా, సాహిత్యంలోనైనా, వైద్యరంగంలోనైనా, సాంకేతిక రంగంలోనైనా కొత్త మార్గాన్ని ఎంచుకున్నవారే కొత్త చరిత్రను సృష్టించారు. నేడు మనం పవిత్రంగా భావిస్తున్న అనేక పరిశోధనా ప్రమాణాలు కూడా ఒకప్పుడు ఎవరో ప్రతిపాదించిన కొత్త విధానాలే. అంటే మొదట ఆవిష్కరణ జరిగింది; తరువాత దానికి మార్గదర్శకాలు వచ్చాయి. మార్గదర్శకాలు ఆవిష్కరణలను సృష్టించలేదు.

పర్యవేక్షకుడి పాత్ర... నియంత్రణా? మార్గనిర్దేశమా?

ఇక్కడ పరిశోధన పర్యవేక్షకుల పాత్ర కూడా అత్యంత కీలకం. వారి బాధ్యత పరిశోధకుడిని కేవలం నియమాలకు పరిమితం చేయడం కాదు; స్వతంత్రంగా ఆలోచించేలా ప్రోత్సహించడం. కొత్త ఆలోచనను తిరస్కరించే ముందు అది శాస్త్రీయంగా ఎంత బలంగా ఉందో పరిశీలించాలి. మార్గనిర్దేశం అవసరం. కానీ మార్గనిర్దేశం, మేధో స్వేచ్ఛకు ప్రత్యామ్నాయం కాదు .

### సంస్కరణ అవసరం... వ్యవస్థలోనే

ఇది నియమాలకు వ్యతిరేకంగా చేసే వాదన కాదు. నియమాలు తప్పనిసరి. ప్రమాణాలు అవసరం. విద్యా నిజాయితీ అనివార్యం. కానీ ప్రమాణాలు నాణ్యతను కాపాడాలి; కొత్త ఆలోచనలను నిరోధించకూడదు. పరిశోధనలో క్రమశిక్షణ ఉండాలి; అదే సమయంలో అన్వేషణకు కూడా అవకాశం ఉండాలి.

భారత్ ప్రపంచస్థాయి పరిశోధనలో ముందంజలో నిలవాలంటే ప్రయోగశాలలు, నిధులు, మౌలిక సదుపాయాలతో పాటు మరో అంశాన్ని కూడా సమానంగా ప్రోత్సహించాలి---ఆలోచించే స్వేచ్ఛ. విశ్వవిద్యాలయాలు పరిశోధకుడిని "ఇది ఇప్పటివరకు ఎవరూ చేయలేదు" అని ఆపే వ్యవస్థలుగా కాకుండా, "ఇది ఎందుకు చేయాలి?" అని అడిగే వేదికలుగా మారాలి.

### ముగింపు

డాక్టరేట్ పట్టా అనేది నియమాలను ఎంత కచ్చితంగా అనుసరించామన్న దానికి మాత్రమే గుర్తింపు కాదు. అది కొత్త జ్ఞానాన్ని సృష్టించగల సామర్థ్యానికి ఇచ్చే గుర్తింపు. ఆ సామర్థ్యాన్ని నియమాల పేరుతో పరిమితం చేస్తే, పరిశోధన సంఖ్య పెరగవచ్చు; కానీ విజ్ఞాన సంపద పెరగదు.

పరిశోధనలో మార్గదర్శకాలు అవసరమే. కానీ అవి మార్గాన్ని చూపే దీపస్తంభాలుగా ఉండాలి; ముందుకు వెళ్లకుండా అడ్డుకునే గోడలుగా కాదు.



**ప్రొఫెసర్. విశ్వేశ్వర రావు చెనమల్లు**

# గ్రేట్ గ్రీన్ వాల్‌తో తీరానికి హరిత కవచం

(ప్రతాప్)

**వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా తీర ప్రాంతాలకు పెనుసవాలుగా మారుతున్నాయి. సముద్ర మట్టం పెరగడం, తుపానుల తీవ్రత అధికం కావడం, తీర కోత, ఉప్పునీటి చొరబాటు వంటి పరిణామాలు సముద్ర తీరాన నివసించే ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతినే రక్షణ కవచంగా మలచే ప్రయత్నంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' ప్రాజెక్టు పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, జీవవైవిధ్య సంరక్షణ, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేసే వినూత్న కార్యక్రమంగా నిలుస్తోంది.**




ఆంధ్రప్రదేశ్‌కు 974 కిలోమీటర్ల సముద్ర తీరరేఖ ఉండగా, ఖాడీలు, నదీముఖద్వారాలను కలుపుకుంటే అది 1,053 కిలోమీటర్లకు విస్తరించింది. శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు 14 తీర జిల్లాల్లో విస్తరించిన ఈ ప్రాంతంలో దాదాపు 32 శాతానికి పైగా భూభాగం తీవ్ర తీర కోతను ఎదుర్కొంటోంది. ప్రతి ఏడాది సంభవించే తుపానులు, రాకాసి అలలు, ఉప్పెనల కారణంగా మత్స్యకారులు, రైతులు, తీర గ్రామాల ప్రజలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సముద్ర తీరం వెంబడి ఐదు కిలోమీటర్ల వెడల్పుతో సుమారు 5,000 చదరపు కిలోమీటర్ల పరిధిలో మూడంచెల జీవవైవిధ్య రక్షణ వలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 33 లక్షల మంది తీరప్రాంత ప్రజలకు ప్రత్యక్ష రక్షణ లభించే అవకాశం ఉంది.

మొదటి అంచె సముద్ర అలలను తట్టుకునే సహజ రక్షణ గోడగా రూపుదిద్దుకోనుంది. ఉప్పునీటిలో పెరిగే మడ అడవుల పునరుద్ధరణకు ఇందులో అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. మడ అడవులు తుపాను అలల ప్రభావాన్ని దాదాపు 60 శాతం వరకు తగ్గించడమే కాకుండా తీర కోతను అరికట్టి, ఉప్పునీరు లోపలి భూభాగాల్లోకి చొరబడకుండా నిరోధిస్తాయి. మడ అడవులు పెరగలేని ఇసుక దిబ్బల ప్రాంతాల్లో సర్వి, సుబాబుల్ వంటి గాలులను తట్టుకునే వృక్షాలను నాటి సహజ రక్షణను మరింత బలోపేతం చేయనున్నారు. దీంతో సముద్ర జీవుల పునరుత్పత్తికి, మత్స్య సంపద పెరుగుదలకు, పక్షుల సంరక్షణకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతుంది.

రెండో అంచెలో సర్వి, వెదురు, తెల్లమద్ది వంటి ఎత్తైన వృక్షాలతో పాటు స్థానిక పొదలను కాలువల గట్లు, రహదారుల వెంట అభివృద్ధి చేస్తారు. ఇవి తుపాను గాలుల వేగాన్ని తగ్గించి, ఉప్పు గాలులు వ్యవసాయ భూముల్లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటాయి. చెట్ల వేళ్లు నేలను గట్టిగా పట్టుకోవడం వల్ల ఇసుక కదలిక తగ్గి భూగర్భ జలాల్లోకి ఉప్పునీటి చొరబాటు కూడా నియంత్రితమవుతుంది. జీవవైవిధ్యానికి ఆశ్రయం కల్పించడంతో పాటు తీర ప్రాంత పర్యావరణ సమతుల్యతను బలోపేతం చేయడంలో ఈ హరిత వలయం కీలక పాత్ర పోషిస్తుంది.

మూడో అంచెను కమ్యూనిటీ బఫర్ జోన్‌గా అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మామిడి, జీడిమామిడి, నేరేడు, పలస వంటి ఫలవృక్షాలు, సామాజిక అడవులను పెంపొందించడం ద్వారా స్థానిక ప్రజలకు అదనపు ఆదాయం సమకూర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో వారిని భాగస్వాములను చేయనున్నారు. దీని వల్ల తీరప్రాంతాల్లో పచ్చదనం పెరగడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది.

ఈ మహత్తర కార్యక్రమాన్ని పర్యావరణ, అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో 2030 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, కాంపా నిధులు, జిల్లా ఖనిజ అభివృద్ధి నిధులు, పర్యావరణ నిధులు, అంతర్జాతీయ వాతావరణ ఆర్థిక వనరులను సమన్వయం చేస్తూ ఈ ప్రాజెక్టును దశలవారీగా అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ క్లైమేట్ చేంజ్ మిటిగేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో కోట్లాది మొక్కలను పెంచి తీర ప్రాంతాల్లో నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం హరిత విస్తీర్ణాన్ని సాధించాలనే దీర్ఘకాలిక లక్ష్యానికి ఈ ప్రాజెక్టు బలమైన పునాది కానుంది.

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధమైన అంశాలు కావు; సరైన ప్రణాళికతో రెండింటినీ సమన్వయం చేయవచ్చని ఈ ప్రతిపాదిత గ్రేట్ గ్రీన్ వాల్ చాటుతోంది. ఇది కేవలం వృక్షారోపణ కార్యక్రమం కాదు; ప్రకృతి ఆధారిత విపత్తు నిర్వహణకు, తీరప్రాంత ప్రజల భద్రతకు, జీవవైవిధ్య పరిరక్షణకు, వాతావరణ మార్పులను ఎదుర్కొనే సుస్థిర అభివృద్ధికి నిర్మిస్తున్న హరిత రక్షణ కవచం. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, దేశంలోని ఇతర తీర రాష్ట్రాలకు కూడా ప్రకృతి ఆధారిత అభివృద్ధి నమూనాగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# లీక్ వీరుల ఆట కట్టించే బిల్లు

**హెచ్. ప్రతాప్**

విద్యా ప్రవేశాలు, ఉద్యోగాల కోసం జరిగే పోటీ పరీక్షలు లక్షలాది మంది యువత జీవితాలను మలిచే కీలక మలుపులు. అలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం కేవలం ఒక అక్రమం కాదు; ప్రతిభను అవమానించే, నిజాయితీని శిక్షించే, యువత భవిష్యత్తును దోచుకునే సామాజిక నేరం. ఒక ప్రశ్నాపత్రం లీక్ కావడం అంటే లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల శ్రమను, తల్లిదండ్రుల త్యాగాలను, పరీక్షల నిర్వహణ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ఒక్క క్షణంలో ఛిద్రం చేయడమే. ఇటీవలి కాలంలో వరుసగా వెలుగుచూసిన ప్రశ్నాపత్రాల లీకేజీలు దేశంలో పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా పరీక్షల అక్రమాల నిరోధక చట్టం యువత భవిష్యత్తును పరిరక్షించే కీలక సంస్కరణగా భావించాలి.

నీట్, యూజీసీ--నెట్, పోలీసు, ఉపాధ్యాయ, ఇతర నియామక పరీక్షల్లో చోటుచేసుకున్న లీకేజీలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. లక్షలాది మంది అభ్యర్థులు పరీక్షలు రాసిన తర్వాత అవి రద్దు కావడం, మళ్లీ నిర్వహించాల్సి రావడం వల్ల యువత ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వాలపై కోట్ల రూపాయల అదనపు భారం పడింది. కొద్దిమంది అక్రమార్కుల దురాశ కారణంగా లక్షలాది మంది యువత జీవితాలు అనిశ్చితిలోకి నెట్టివేయబడటం ఏ ప్రజాస్వామ్యానికైనా ప్రమాదకర సంకేతమే.

ఈ దుష్పరిణామాలకు అడ్డుకట్ట వేయడానికే కేంద్రం కఠిన చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రశ్నాపత్రాల లీకేజీ, సమాధాన పత్రాల మార్పిడి, కంప్యూటర్ ఆధారిత పరీక్షల్లో చొరబాటు, పరీక్షల నిర్వహణలో కుట్ర, సంఘటిత మోసాలకు పాల్పడిన వారిపై ఈ చట్టం కఠిన శిక్షలను విధిస్తోంది. నేరం రుజువైతే మూడు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు తప్పవు. పరీక్షలను వ్యాపారంగా మార్చుకున్న ముఠాలకు ఇది గట్టి హెచ్చరిక. ప్రతిభను మోసం ఓడించకూడదనే ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనం.

అయితే చట్టం ఒక్కటే పరిష్కారం కాదు. లీకేజీలకు దారితీసే బలహీనతలను పూర్తిగా తొలగించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలపై ఉంది. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి పరీక్ష పూర్తయ్యే వరకు ప్రతి దశలో అత్యాధునిక భద్రతా ప్రమాణాలు అమలు చేయాలి. కృత్రిమ మేధ, సంకేతీకరణ, బయోమెట్రిక్ ధ్రువీకరణ, ప్రత్యక్ష నిఘా వంటి సాంకేతిక వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలి. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులు, సంస్థలపైనా సమాన బాధ్యతను నిర్ధారించాలి. చట్టం కఠినంగా ఉండటమే కాదు, దాని అమలు కూడా నిర్దాక్షిణ్యంగా ఉండాలి.

పరీక్ష రద్దయిన ప్రతిసారి నష్టపోయేది యువతే. అందుకే ప్రత్యామ్నాయ పరీక్షలను త్వరగా నిర్వహించడం, అభ్యర్థులపై పడే ప్రయాణ, వసతి, ఆర్థిక భారాన్ని తగ్గించడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో విద్యాసంస్థల్లో నైతిక విలువలు, నిజాయితీ, పోటీ పరీక్షల పట్ల బాధ్యతాయుత దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది.

దేశ భవిష్యత్తు ప్రతిభావంతులైన యువత చేతుల్లో ఉంటుంది. ఆ ప్రతిభకు అడ్డుగా నిలిచే లీక్ ముఠాలను ఉపేక్షిస్తే సమాజం మూల్యం చెల్లించక తప్పదు. ప్రశ్నాపత్రం లీక్ చేయడం ఒక నేరం మాత్రమే కాదు; దేశ భవిష్యత్తును దోచుకోవడమే. కొత్త చట్టం కాగితాలకే పరిమితం కాకుండా కఠినంగా అమలైతేనే పరీక్షలపై ప్రజల విశ్వాసం పునరుద్ధరించబడుతుంది. అప్పుడే లీక్ వీరుల ఆటకు శాశ్వతంగా తెరపడుతుంది.

# మైనారిటీ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

### సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ

### మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, ఆగస్టు06 (జయ జయహే )**



మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన,ఉన్నత విద్య కు తోడ్పాటు అందిస్తూ ప్రోత్సాహం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్,కంప్యూటర్ అవగాహన శిక్షణ కార్యక్రమంలో మూడవ రోజు కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ పర్యవేక్షణలో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది 60 మందికి అమరావతి లోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం) ప్రధాన కార్యాలయంలో శిక్షణ జరుగుతోంది.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ శిక్షణ పొందుతున్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఉర్దూ అకాడమీ 1975లో విద్యా శాఖకు అనుబంధంగా ఏర్పాటైందన్నారు.1993 లో మైనారిటీల సంక్షేమ శాఖ ఏర్పాటు అయ్యాక ఉర్దూ అకాడమీని, మైనారిటీ సంక్షేమశాఖ క్రిందికి చేర్చడం జరిగింది అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను గతంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉర్దూ అకాడమీ క్రింద కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం అత్యంత సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యం కలిగిన కంప్యూటర్లను కొనుగోలు చేసి రాష్ట్రంలోని 36 కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. మైనారిటీల విద్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత తో కూడిన కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. మైనారిటీ యువతను సాంకేతికంగా బలోపేతం చేయడానికి ఉర్దూ అకాడమీ చేపడుతున్న ఈ తరహా వినూత్న కార్యక్రమాలు అభినందనీయమని చైర్మన్ ఫారూఖ్ షుబ్లీని మంత్రి ఫరూక్ అభినందించారు. అధ్యాపకులు ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించి, వారిని ఆధునిక సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నిజాముద్దీన్,టర్నిన్ లెర్నింగ్ సొల్యూషన్స్ సీఈఓ శ్రీకాంత్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ కు చెందిన ప్రముఖులు,ట్రైనర్ యశ్వంత్ పాల్గొన్నారు. ప్రత్యేక అతిథి గా అధ్యాపకుడు మణి దీప్ హాజరై ఉర్దూ అకాడమీ సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణలో ఏఐ, కంప్యూటర్ అవగాహను విశదీకరించారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు పాత్ర, విద్యా రంగంలో ఏఐ వినియోగం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు తమ నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. నాలెడ్జ్ టెక్నాలజీస్ ఎండి ఆనందరావు, నైపుణ్యాభివృద్ధి, విద్య, కెరీర్ పై శిక్షణ ఇచ్చారు.



## 680 కుటుంబాలకు చేరిన కూటమి పాలన సందేశం

**బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 6, జయ జయహే.**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీలో ఇంటింటి ప్రచారాన్ని 100 శాతం పూర్తి చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి కూరపాటి శంకర్‌రెడ్డి,మండల అధ్యక్షులు చెంచు రామానాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ మునిచంద్ర నాయుడు ఆదేశాల తో మండల ప్రధాన కార్యదర్శి రవి నాయుడు ఆధ్వర్యంలో బూత్ నంబర్లు 19, 20, 21 పరిధిలోని 680 కుటుంబాలను కలిసి రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నెరవేర్చిన హామీలను వివరించారు. అత్యధిక కుటుంబాలు ఉన్న ఈ బూత్‌లలో ఇంటింటి ప్రచారాన్ని విజయవంతంగా పూర్తిచేయడం పై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేంద్ర నాయుడు,యూనిట్ ఇన్చార్జి సునీల్ నాయుడు, బూత్ కన్వీనర్ వెంకటేశ్వర్లు,మండల తెలుగు యువత అధ్యక్షుడు పవన్, కొశా ధికారి బాబు నాయుడు, సాయితేజ, కో కన్వీనర్ సాయి,గ్రామ కమిటీ నాయకులు, బూత్ ఇన్చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంద్ర విమానంపై విహరించిన సుబ్రహ్మణ్యం స్వామి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 06,జయ జయహే**



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ చంగల్రాయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా గురువారం ఉదయం ఇంద్ర విమానంపై స్వామి వారిని విహారింప చేశారు. కార్యక్రమాల్లో చైర్మన్ కొట్టె సాయి,ఈఓ, అధికారులు,పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.




## మధ్యవర్తిత్వంతో సామరస్య సమాజ నిర్మాణంకు సహకరించాలి

### 12వ అదనపు జిల్లా జడ్జి లలాష్ పెదగాడి.

**శ్రీకాళహస్తి, ఆగస్టు 06,జయ జయహే.**

మధ్యవర్తిత్వం ద్వారా సామరస్య సమాజ నిర్మాణంకోసం అందరూ సహకరించాలని. 12వ అదనపు జిల్లా జడ్జి లలాష్ పెదగాడి పిలుపునిచ్చారు. "మిడియేషన్ ఫర్ ది నేషన్ డ్రైవ్" కార్యక్రమములో భాగంగా గురువారం శ్రీకాళహస్తి పట్నంలోని కోర్ట్ ఆవరణ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 12వ అదనపు జిల్లా జడ్జి లలాష్ పెదగాడి, సీనియర్ సివిల్ జడ్జ్ వెన్నెల, న్యాయవాదులు, మధ్యవర్తిత్వ నిపుణులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లుపాల్గొన్నారు.ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ న్యాయస్థానాలపై పెరుగుతున్న భారం తగ్గించడం, వివాదాలను పరస్పర చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించడం, ప్రజల్లో మధ్యవర్తిత్వంపై అవగాహన పెంపొందించడం, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మధ్యవర్తిత్వ విధానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వివాదాలను కోర్టుల వెలుపల వేగంగా, తక్కువ ఖర్చుతో, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం ఉత్తమ మార్గమని వారు పేర్కొన్నారు.

## గుడ్ల పార్ధసారధికి ఏపీ ఎన్ఆర్టీ కోఆర్డినేటర్ బాధ్యతలు

**బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 06,జయ జయహే.**



చిత్తూరు జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండలం, పుత్తేరి గ్రామానికి చెందిన గుడ్ల పార్ధసారధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎన్ఆర్టీ రెండో విడతలో కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఖతార్‌లో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న పార్ధసారథి, ప్రవాసాంధ్రుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ బాధ్యతలను అప్పగించింది. కోఆర్డినేటర్‌గా ప్రవాసాంధ్రులను ప్రభుత్వ కార్యక్రమాలతో అనుసంధానం చేయడం, విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలకు అవసరమైన సమాచారం, సేవలను అందించడం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు.

# గ్రంథాలయాలకు మెరుగైన వసతులు కల్పించాలి

### ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేసిన చైర్మన్

**చోడవరం ఆగస్టు 6 జయ జయహే**



చోడవరం నియోజకవర్గంలో గ్రంథాలయాలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలని ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజును కోరారు. గురువారం చోడవరం గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు.గ్రంథాలయ సంస్థ అభివృద్ధి కొరకు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రంథాలయంలో కంప్యూటర్లు, ఉచిత వై పై మరియు ఇ-లైబ్రరీ సౌకర్యాలు కల్పించాలనీ, యువతకు ఉపయోగపడేలా గ్రూప్స్, సివిల్స్ బ్యాంకింగ్ పరీక్షల పుస్తకాలను సరఫరా చేయాలనీ ఎమ్మెల్యే సూచించారు. కాగాప్రస్తుతం చోడవరం లో ఉన్న శాఖా గ్రంథాలయంనకు పెరుగుతున్న పాఠకుల రద్దీకి, ఆధునిక అవసరాలకు ఈ భవనం సరిపోవడం లేదు. అదనపు వసతి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను గ్రంథాల సంస్థ చైర్మన్ కోరారు.ప్రస్తుతం విశాఖపట్నం నగరం ఐటీ హబ్ గా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విషయం విదితమే. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, ఐటీ ఉద్యోగులకు అధునాతన సాంకేతిక వసతులతో కూడిన ఒక ఆధునిక డిజిటల్ గ్రంథాలయం అందుబాటులో ఉంచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.ఈ తరుణంలో చోడవరం పరిసర ప్రాంతాలలో గ్రంథాలయ నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలమును శాఖా గ్రంథాలయం నకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా సకల సదుపాయాలతో కూడిన నూతన మరియు ఆధునిక గ్రంథాలయ భవనాన్ని నిర్మించడానికి స్థలం కేటాయించాలని చైర్మన్ ఎమ్మెల్యేని కోరారు.చోడవరం శాఖా గ్రంథాలయం ను తనిఖీ చేసి, పుస్తకాలు అమరిక,పరిసర ప్రాంతాలు శుభ్రం చేయాలని లైబ్రేరియన్ కు సూచించారు. అలాగే ఆసక్తి గల ప్రాంతాలలో పెరుగుతున్న జనాభా, విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి తీసప్రస్తుతం ఈ నియోజకవర్గంలోని గ్రంథాలయాల్లో పుస్తక నిక్షిప్త కేంద్రాలను మంజూరు చేసి స్థానిక విద్యార్థులు, పుస్తక ప్రేమికులు లైబ్రరీల వైపు మరిచేలా గ్రంథాలయ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతైనా ఉందన్నారు. ఈ కేంద్రం లు ఏర్పాటుకు సంబంధించి:పుస్తక నిక్షిప్త కేంద్రాల నిర్వహణ: పుస్తక నిక్షిప్త కేంద్రాలు గ్రామ పంచాయతీ/ కార్పోరేషన్ ఏర్పాటు చేసిన ఉచిత బిల్డింగ్ లో మాత్రమే నిర్వహించాలన్నారు. ఫర్నిచరు కూడా వాళ్ళే ఏర్పాటు చేయాలన్నారు. బి డి సి నిర్వాహణ కు కరెంటు, వ్రాత సామగ్రి కుడా వారే సంకూర్చాలి కాబట్టి విద్యార్థులు, ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, చోడవరం నియోజకవర్గంలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి తగిన ప్రభుత్వ భవనాలను కేటాయించాలనీ ఎమ్మెల్యేను కోరారు. అలాగే విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ కి సంబంధించిన క్యూ ఆర్ గ్రంథాలయ యాప్ ను ఆవిష్కరించారు. పాఠకులు కి డిజిటల్ సేవలు అందించాలని ప్రతిష్టాత్మకంగా యాప్ ను రూపొందించారని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, స్థానిక లైబ్రేరియన్ ఎం ఎస్ ఎల్ జోగేశ్వరి, పాఠకులు జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు.




## విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

### వైసిపి భారీ ఎత్తున ఆందోళన

**అచ్యుతాపురం, ఆగస్టు 6, జయ జయహే:**

ఎలమంచిలి నియోజకవర్గ పరిధిలోని అచ్యుతాపురం మండలంలో మెగా డీఎస్సీ పేరుతో విద్యార్థులను దగా చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఎలమంచిలి వైసిపి ఇన్చార్జి కరణం ధర్మశ్రీ డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ విద్యార్థులకు అన్యాయం చేసి, తమ కార్యకర్తలకు తప్పుడు మార్గంలో ఉద్యోగాలు ఇప్పించుకున్న మంత్రి నారా లోకేష్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని, డీఎస్సీ పేరుతో జరిగిన అవకతవకలపై సిబిఐ ఎంక్వయిరీ జరిపించాలని కరణం ధర్మశ్రీ డిమాండ్ చేశారు. అచ్చుతాపురం తాసిల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరుద్యోగ అభ్యర్థులు వైసిపి కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష చేసి, మెగా డీఎస్సీ పేరుతో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కూటమి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ధర్మశ్రీ హెచ్చరించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలని, బకాయి పడిన ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దేశం శెట్టి శంకర్రావు, కోన బుజ్జి, నర్మాల కుమార్, గంగిరెడ్డి రాము, సిఐడి బుజ్జి, రావి శోభన్ బాబు, నగిరెడ్డి నాగేశ్వరరావు, దొడ్డి కృష్ణ, తోట వెంకటేష్, గంగులి శ్రీను, పోలవరపు రమణ, ప్రసాద్, రవీంద్ర, రాజు, చందాక శ్రీను తదితరులు నాయకత్వం వహించారు. నారా లోకేష్ రాజీనామా చేయాలని, తక్షణమే సిబిఐ ఎంక్వయిరీ జరిపించాలని, నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని, ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలని, పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసపు వాగ్దానం, తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని యువతకు, వైసిపి కార్యకర్తలకు ధర్నాశ్రీ పిలుపునిచ్చారు.




## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ మైన్స్ సర్వేయర్

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ సమీపంలో గల గనులు భూగర్భ గనుల శాఖ ఆఫీసు పై ఏసీబీ అధికారులు గురువారం ఆకస్మికంగా రైడ్ చేసిన సంఘటన చోటుచేసుకుంది దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఊదేరు గ్రామంలో ఉన్న ఒక క్వారీకి లీజుకు సంబంధించి అనకాపల్లి మైన్స్ కార్యాలయంలో లీజుకు దరఖాస్తు చేసుకోవడం జరిగింది ఈ దరఖాస్తు సుమారు పెట్టి ఐదు మాసములు కావస్తున్నది దానికి కావలసిన అగ్రిమెంట్ లీజ్కు సంబంధించిన అంతా ప్రాసెస్ చేయడం జరిగింది ప్రభుత్వానికి చెల్లించవలసిన ఫీజు కూడా చెల్లించడం జరిగింది . దీనికి అనుమతికి సంబంధించి పై అధికారులకు ఫైల్ పంపించేందుకు 15 లక్షల రూపాయలు మైన్స్ గ్రేడ్ 3 అధికారి మురళీకృష్ణ డిమాండ్ చేయడం జరిగింది. అయితే గతంలో కూడా ఈ మురళీకృష్ణ లంచం తీసుకుంటూ పట్టుబడి సంఘటన మరువకముందే, లంచానికి అలవాటు పడ్డ ఆ అధికారి తను తప్పును సరిదిద్దుకోకపోగా లీజు దారుడు అంత మొత్తం ఇవ్వలేక తుంపాల కు చెందిన ఆ వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించడం జరిగింది . దీంతో ఏసీబీ అధికారులు గురువారం పక్కా ప్రణాళికతో లీజు దరఖాస్తు దారుడు నుండి 5 లక్షలు లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారి రమణమూర్తి ఏసీబీ అడిషనల్ ఎస్పీ హర్షిత మైన్స్ సర్వేయర్ మురళీకృష్ణను డబ్బులతో సహా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్ గా పట్టుకోవడం జరిగింది మైన్స్ మురళీకృష్ణను అదుపులో తీసుకొని ఆ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు ఏసీబీ అధికారులు




## ఉమ్మలాడలో తల్లిపాల వారోత్సవాలు

**మునగపాక, ఆగస్టు 6, జయ జయహే:**

మునగపాక మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం పరిధిలో అంగన్వాడి టీచర్ ఎం.కోటేశ్వరి ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాధాన్యత, పిల్లల ఆరోగ్యం ఎదుగుదల గురించి మహిళలకు పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలు, తల్లులు యువజన మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో జక్కంపూడి ఓ బ్రాండ్..!





**రాజమహేంద్రవరం: జయ జయహే:ఆగస్ట్ 6**

కడియం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని అంకితం చేసి, ప్రజాసేవకు చిరునామాగా నిలిచిన దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు సమాజ సేవలో ఓ బ్రాండ్ అని వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. ఆయన 73వ జయంతి సందర్భంగా గురువారం కడియం మండలం బుర్రిలంక గ్రామంలో కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం విశేష స్పందన పొందింది.కార్యక్రమానికి మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కడియం ఎమ్మెల్యేగా, మంత్రిగా జక్కంపూడి రామ్మోహన్‌రావు చేసిన అభివృద్ధి పనులు నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడిన ఆయన సేవా దృక్పథం నేటి యువతకు ఆదర్శమని అన్నారు.జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహన్‌రావు బ్లడ్ బ్యాంక్ వైద్యుల పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన కాంటినెంటల్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్, ఈసీజీ, ఎకో-2డీ, స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య సలహాలు అందించారు. వేలాది మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.శిబిరాలను రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి డాక్టర్ రాజశ్రీ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి సోదరులను ప్రత్యేకంగా అభినందించారు.మండలంలోని పలు గ్రామాల నుంచి వేలాది మంది మహిళలు, ప్రజలు శిబిరాలకు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జక్కంపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీరు, భోజనంతో పాటు అన్ని సౌకర్యాలను కల్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకులు రావిపాటి రామచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, తాడాల చక్రవర్తి, నక్క రాజబాబు, ఈలి గోపాలం, వెలుగుబంటి అచ్యుత్ రామ్, తిరుమలశెట్టి శ్రీను, ముత్యం జగదీష్, బత్తుల రాము, సింగంశెట్టి శ్రీను, సలాది ప్రసాద్, చిరుకూరి రామకృష్ణ, ఊటుకూరి శైలజ, తాడాల వీర వెంకటరావు గురుస్వామి, తోకల శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## యూరియా కొరతను నివారించాలని ఏ ఓ ని కోరిన తలపా దామోదరం రెడ్డి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 06,జయ జయహే.**

వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డి కి శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో యూరియా కొరత నివారించాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో రైతులు యూరియా కొరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వెంటనే రైతుల ఇబ్బందులు తొలగించాలని అన్నారు.సకాలంలో యూరియా కార్డులు అందజేసి యూరియా అందే విధంగా చర్యలు చేపట్టాలని, కోరారు. ఎల్ నినో పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులను చైతన్యవంతులు చేయాలని రైతుల నష్టపోకుండా వారికి తగు సూచనలు చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని  కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా యువజన కాంగ్రెస్  అధ్యక్షులు సీతారాం, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, నాగరాజు, షాన్ మైఖేల్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ర్యాష్ డ్రైవింగ్, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 6**

ఎవి అప్పారావు రోడ్డులో మెడికో విద్యార్థిని ప్రియాంక కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన ఘటనపై బాధ్యులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు టికె విశ్వేశ్వరరెడ్డి, రాజమండ్రి సిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినికి న్యాయం చేయడంతో పాటు నగరంలో పెరుగుతున్న ర్యాష్ డ్రైవింగ్, అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ మెడికో విద్యార్థిని ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమన్నారు. ప్రియాంక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, నిందితులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సిసిటివి దృశ్యాల ఆధారంగా గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రధాన కూడళ్లు, విద్యాసంస్థల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టేందుకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచి పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నియంత్రణపై ఇప్పటి నుంచే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బాధితురాలు ప్రియాంకకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి, అవసరమైతే ఆర్థిక సహాయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు టికె విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్ ఈ మేరకు ప్రభుత్వానికి, పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



## కందుల జెస్సిని సత్కరించిన డా. గోరంట్ల రవి రామ్ కిరణ్

**రాజమహేంద్రవరం: జయ జయహే**

ఆగస్టు 6:ప్రతిష్ఠాత్మక శక్తీ సాట్ కార్యక్రమానికి ఎంపికైన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కందుల జెస్సిని టిడిపి యువ నాయకులు, ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి అభినందనలు తెలిపిన ఆయన, జెస్సి సాధించిన ఘనత రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తమ్మిశెట్టి పద్మజ్యోత్స్న, ఎంఈఓ తులసిదాస్, విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీను, అరుణలను అభినందించారు. జెస్సి విజయానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహమే బలమని పేర్కొన్నారు.డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ, శక్తీసాట్‌కు ఎంపిక కావడం కందుల జెస్సి అసాధారణ ప్రతిభకు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యం ఉందని ఆమె నిరూపించిందన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని, ఇలాంటి విద్యార్థులకు అండగా నిలవడం ద్వారా మరెందరికో స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ ( జి ఎస్ ఆర్  ఫౌండేషన్ ) తరపున జెస్సి విద్యాభ్యాసం, భవిష్యత్ ప్రయాణానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. దేశానికి, రాష్ట్రానికి మరిన్ని విజయాలు తీసుకురావాలని జెస్సికి శుభాకాంక్షలు తెలిపారు.



## బస్సు షెల్టర్ స్థలానికి గ్రహణం

**బుచ్చినాయుడు కండ్రిగ (జయ జయహే) (ఆగస్టు 6):**

మండల పరిధిలోని కుకం భాగ్యం గ్రామంలో ప్రజలు దశాబ్దాలుగా వినియోగించుకుంటున్న ప్రజా స్థలం ఆక్రమణదారుల పక్షమైంది. గ్రామంలోని సర్వే నెంబర్ 54లో ఉన్న స్థలాన్ని గ్రామస్తులు నిత్యం బస్ స్టాప్ (బస్సు షెల్టర్) అవసరాల కోసం, రవాణా సౌకర్యం కోసం ఉపయోగించుకునేవారు. అయితే, కొంతమంది వ్యక్తులు తమ స్వార్థం కోసం, స్వలాభం కోసం ఈ ప్రభుత్వ స్థలాన్ని నిరూపయోగం చేస్తూ అక్రమంగా కబ్జా చేశారని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు ఎండనక, వాననక రోడ్డుపైనే నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ అక్రమ ఆక్రమణపై పలుమార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా, రాతపూర్వకంగా విన్నవించినా ఇప్పటివరకు ఏ ఒక్క అధికారీ స్పందించకపోవడంపై గ్రామస్తులు పట్ల నిరసన వ్యక్తమవుతోంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, సర్వే నెంబర్ 54లోని స్థలానికి సర్వే నిర్వహించి, ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి బస్ స్టాప్ నిర్మాణానికి కేటాయించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.




## డుంబ్రిగూడలో 30 కిలోల హాషిస్ ఆయిల్‌ను స్వాధీనం

### ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్

**డుంబ్రిగూడ: ఆగస్టు 06 జయ జయహే.**

డుంబ్రిగూడ మండలం ప్రాంతంలో నర్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎన్ సి బి అధికారులు భారీ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు చేశారు, పక్క సమాచారంతో ఎన్ సి బి విశాఖపట్నం బృందం చేపట్టిన తనిఖీల్లో 30 కిలోల హాషిస్ ఆయిల్ ను స్వాధీనం చేసుకున్నారు, ఈ ఆపరేషన్లో కేరళ రాష్ట్రం ఇడుక్కి ప్రాంతానికి చెందిన మనోజ్ మథ్యు(47) అనే వ్యాపారితో పాటు ఒడిస్సా లోని మల్కనగిరి జిల్లాకు చెందిన మధ్యవర్తి సాలు మర్రి (26) డుంబ్రిగూడ కు చెందిన విద్యార్థి క్యారియర్ మటం విష్ణువర్ధన్ ( 22) లను అధికారులు అరెస్టు చేశారు, కేరళకు చెందిన నిందితుడు ఈ హషిస్ ఆయిల్ ను స్వీకరించడానికి రాగా మిగిలిన ఇద్దరూ రవాణా లో సహకరించినట్లు అధికారులు తెలిపారు, ఎన్ సి బి జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్, ద్వి వేది నేతృత్వంలో ఇంటలిజెన్స్ ఆఫీసర్ కే కిరణ్ బాబు, సమర్థవంతంగా ఈ దాడి నిర్వహించి మత్తు పదార్థాలు జత్తు చేశారు, నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి విసారాన కొనసాగిస్తున్నారు,




## డీఎస్సీ అక్రమాలపై చోడవరంలో వైఎస్ఆర్సిపి దీక్షలు

### సమగ్ర విచారణ జరపాలంటూ మాజీ మంత్రి డిమాండ్

**చోడవరం, ఆగస్టు 6 జయ జయహే**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం చోడవరం పట్టణంలో పార్టీ యువత ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న నిరాహార దీక్ష శిబిరాన్ని మాజీ మంత్రి చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ ప్రారంభించి దీక్షకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాలలో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అమలు చేయాలని, ఈ అంశాలపై నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ నిరాహార దీక్ష ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీపీ కాసులమ్మతో పాటు ఏడువాక సత్యారావు, పల్లా నర్సింగరావు, దొండ రాంబాబు, దేవరపల్లి సత్య, ఓరుగంటి నెహ్రూ, ఎన్ రాంబాబు, పి వెంకటేష్, బి సూర్యనారాయణ, శ్యామల, పి అప్పారావు, వి ప్రకాష్, మూడేళ్ల శంకర్రావు నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్ల కండువలు నల్ల షర్టు వేసుకొని నిరసన తెలిపారు.




## విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

### కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు..

**కొయ్యూరు  (జయ జయహే )న్యూస్ ఆగష్టు  6**

అల్లూరి జిల్లా కొయ్యూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు ఉన్నత పాఠశాలలో కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు విద్యార్థుల కోసం సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు.     మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాల గురించి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు.చదువుపై పూర్తి దృష్టి సారించి, తమ అభిరుచులు మరియు సామర్థ్యాలకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు.ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మైనర్లు వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించాలని, రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మహిళల పట్ల గౌరవభావంతో మెలగాలని, వేధింపులు, ర్యాగింగ్, సైబర్ వేధింపులకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని అవగాహన కల్పించారు.మొబైల్ ఫోన్ మరియు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోరాదని, తప్పుడు సమాచారాన్ని నమ్మరాదని సూచించారు. కార్యక్రమం చివరలో విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం, మహిళలను గౌరవించడం, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం, చదువుపై దృష్టి సారించి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ప్రతిజ్ఞ చేశారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు



**స్పోర్ట్స్ కోటా పేరిట అర్హత లేని టీడీపీ కార్యకర్తలకు డీఎస్సీ ఉద్యోగాలు కట్టబెట్టారు.**

**డీఎస్సీ నియామక అక్రమాలపై తక్షణమే సిబిఐ విచారణ జరిపించాలి: భూమన కరుణాకర్ రెడ్డి.**

**శ్రీకాళహస్తి, ఆగస్టు 06,జయ జయహే.**

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి హెచ్చరించారు.స్పోర్ట్స్ కోటా పేరిట అర్హత లేని టీడీపీ కార్యకర్తలకు డీఎస్సీ ఉద్యోగాలు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు.డీఎస్సీ నియామక అక్రమాలపై తక్షణమే సిబిఐ విచారణ జరిపించాలని డిమేండ్ చేశారు.అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు.డీఎస్సీ 2025 నియామకాల్లో జరిగిన తీవ్ర అక్రమాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల తో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏపీ జెన్ జెడ్ వార్ రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్ష లో భూమన కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ,2024 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం 'మెగా డీఎస్సీ' అంటూ 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని హడావుడి చేశారన్నారు.కానీ తీరా చూస్తే, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఆ పోస్టులను అంగట్లో సరుకుల్లా పంచిపెట్టారని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటాలో కనీసం పతకాలు సాధించకపోయినా, 'ఛాంపియన్స్' పేరుతో టీడీపీ కార్యకర్తలకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు.కనీసం ఇంటర్ కూడా పాస్ అవ్వని వారికి నకిలీ సర్టిఫికేట్లతో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు కట్టబెట్టడం అత్యంత దారుణమన్నారు. ఉద్యడీఎస్సీ నియామకాల్లో జరిగిన ఈ కుంభకోణంపై సిబిఐ విచారణ జరిపించాలని డిమేండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి స్వామివారి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సిద్దాగుంట సుధాకర్ రెడ్డి, తొట్టంబేడు మండల అధ్యక్షులు ఉన్నం వాసుదేవ నాయుడు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు గంగారి రమేష్, అత్తురూ హరి ప్రసాద్ రెడ్డి, జడ్పీటీసీ సంధ్య, ఏర్పేడు ఇన్చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి,మండల ప్రెసిడెంట్ రమణయ్య యదవ్, తొట్టంబేడు మండల ప్రెసిడెంట్ డా.కోగల సుబ్రహ్మణ్యం, కోవి చంద్రయ్య నాయుడు, కొత్తపాటి శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సిరాజ్ బాషా, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పఠాన్ ఫరీడ్, గోరా, విద్యార్థి విభాగ అధ్యక్షులు బంగారు దిలీప్, యువత విభాగ అధ్యక్షులు సూర సురేష్, శ్రీకాళహస్తి మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరులు నాయుడు, కామి వెంకటేశ్వర్లు,ముని కృష్ణ రెడ్డి, చింత రాజేంద్ర పసల కృష్ణయ్య, నాగరాజు రెడ్డి,మున్నా రాయల్, బులెట్ జయశ్యాం రాయల్, ప్రకాశం పంతులు, ఉత్తరాజి శరవణ కుమార్, సుమతమ్మ, సాగీరా బీ, షర్మిల ఠాగూర్, సునీత సింగ్, పర్వీన్, రాజ్యలక్ష్మి,భారతమ్మ, చెంచయ్య నాయుడు, ఆర్కార్డు ముత్తు పులి రామచంద్ర, గఫూర్,ఫజల్ తదితర నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం

**పాల్గొన నున్న రాష్ట్ర ప్రముఖులు**

**స్థానిక నేతలసమక్షంలో ఆహ్వాన పత్రం ఆవిష్కరణ**

**జంగారెడ్డిగూడెం-జయ జయహే**

నూతనంగా ఎన్ని కైన పట్టణ ఆర్యవైశ్య సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం ఈనెల 9వ తేదీ ఆదివారం ఏర్పాటు చేశారు.ఈ మేరకు అధ్యక్షుడు మాతు రాజా, కార్యదర్శి కొల్లే పర ఆనంద్ గురువారం ఆర్యవైశ్య కళ్యాణ మండపం లో ప్రమాణ స్వీకారం మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాతు రాజా తో పాటు కార్యదర్శి కొల్లేపర ఆనంద్, కోశాధికారి మద్దుల రాంబాబు, యువజన సంఘం అధ్యక్షులు కంచర్ల గణేష్ ,ఇమ్మడి బాలభాస్కర్ తదితర నాయకులు మాట్లాడారు. 9వ తేదీ ఉదయం 8 గంటలకు పట్టణంలోని ఏలూరు రోడ్ నందు ఉన్న సాయిబాబా స్తూపం దగ్గర నుంచిర్యాలీ గా వెళ్ళి బుట్టాయిగూడెం రోడ్జంక్షన్ లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్థా మని తెలిపారు.అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ర్యాలి కొనసాగుతుందనిపేర్కొన్నారు. వాసవి మాతకు పూజలు చేసి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకారంకార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులందరూ ఈ ర్యాలీలో పాల్గొని ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



## కొయ్యూరు మండలంలో 7 మోర్చాల మండల అధ్యక్షుల నియామకం

**జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి ప్రకటన**

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 07,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో పార్టీ బలోపేతానికి సంబంధించి ఏకగ్రీవంగా ఎంపిక చేసిన 7 అనుబంధ మోర్చాల మండల అధ్యక్షుల పేర్లను పార్టీ జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి ప్రకటించారు. కొయ్యూరు మండల పదాధికారుల సమావేశం అనంతరం ఈ నియామకాలు జరిగాయి. ఈ కార్యాక్రమం లో నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు,యువ మోర్చా- సుర్ల మణికంఠ, ఓబీసీ మోర్చా - గాలి దేవుడు, కిసాన్ మోర్చా - సోళ్ళ వెంకటేష్, మహిళా మోర్చా - చింతపల్లి లీలావతి, ఎస్సీ మోర్చా - నెల్లి సత్తిబాబు, మైనార్టీ మోర్చా - బూధరాళ్ల రమేష్, గిరిజన మోర్చా - నడిగట్ల నూకరాజు లను ఎంపిక చేసారు. నూతనంగా ఎంపికైన మండల అధ్యక్షులను సాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివకుమార్, జిల్లా ఇన్చార్జి పుట్టా గంగయ్య, మండల ఇన్చార్జి ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు, సన్యాసిరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కె.జి.ఆర్.రాణి, ప్రధాన కార్యదర్శి గౌరీ పార్వతి, ఏఎంసీ చైర్పర్సన్ మంగతల్లి, ఉష సొసైటీ డైరెక్టర్ చంద్రరావు, రాజు, అప్పలరాజు, డి.వి.డి. ప్రసాద్, శ్రీను తదితర పార్టీ సీనియర్ నేతలు, పదాధికారులు పాల్గొన్నారు.



## వసతి గృహం అభివృద్ధికి విరాళం అందజేసిన రోటరీ క్లబ్

**విజయనగరం, ఆగస్టు 6:(జయ జయహే )**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహం అభివృద్ధి కోసం రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అధ్యక్షులు మరియు కార్యదర్శి రూ.20,000/- విరాళాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీ కంది వెంకటరమణ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ కె. సత్యం మరియు మేనేజింగ్ కమిటీ సభ్యులు ఏడిద వీర్రాజు పాల్గొన్నారు.

## బడి కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

**కొయ్యూరులో 4వ రోజుకు చేరిన నిరసన దీక్ష.**

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 6**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం గింజర్తి ఎంపీపీ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు చేస్తున్న పోరాటం ఇంకా కొనసాగుతోంది.1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు తరగతులను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎంఈవో కార్యాలయం ఎదుట వారు చేపట్టిన న్యాయ పోరాటం, నిరసన దీక్ష గురువారం నాటికి 4వ రోజుకు చేరుకుంది.వంటావార్పుతో నిరసన దీక్షా శిబిరం వద్ద గురువారం నాడు గ్రామస్తులు, విద్యార్థులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు.పిల్లల చదువు, ఉజ్వల భవిష్యత్తు కోసం ఊరంతా ఒక్కటై ఈ దీక్షలో పాల్గొనడం గమనార్హం. విద్యాశాఖ అధికారులు వెంటనే ఈ విషయంపై స్పందించి, తరగతులను కొనసాగించాలని ప్రజలు, విద్యార్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.అధికారులు సానుకూలంగా స్పందించి, తమ గ్రామ పాఠశాలను కాపాడి పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వృద్ధులను ఆదుకోవడంలోనే ఆనందం ఉంది: భీశెట్టి బాబ్జి





**విజయనగరం (జయ జయహే)**

గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులను తగిన సమయానికి ఆదుకుంటే కలిగే ఆనందం వర్ణించలేనిదని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు గురువారం అట్టాడ బి.ఎన్.ఆర్. ఆశ్రమం లో వృద్ధుల సమక్షంలో పెండ్లి రోజు వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ తమ కుటుంబానికి ఉన్న శక్తిమేరకు వృద్ధులకు నిత్య అన్నదానం ఏర్పాటు చెయ్యడమే కాకుండా కొంతమంది అనారోగ్యం తో నిస్సహాయ స్థితిలో మంచంపై ఉన్నవారికి అడపా,దడపా మంచి భోజనం అందిస్తున్నామని భీశెట్టి ఫౌండేషన్ తరపున తాము చేస్తున్న కార్యక్రమాలకి స్నేహితులు, కుటుంబసభ్యులు సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు, ఆశ్రమం లో ప్రతి ఏడాది జామి మండలం లో పదవ తరగతి లో మంచి మార్కులతో పాసయిన విద్యార్థులను సత్కరించే కార్యక్రమం తో పాటుగా సంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ రచయితల జయంతి, వర్ధంతులు పేరుతో జరిగే సాహిత్య కార్యక్రమాలు, తనకి అత్యంత ఆనందం కలిగిస్తోందని అన్నారు తన పెండ్లి రోజు వేడుకల సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమం లో చీఫ్ ఫార్మశి అధికారి బాల వెంకట లక్ష్మి,ప్రముఖ పారిశ్రామిక వేత్త సునీల్ ఎంటర్ ప్రైజెస్ అధినేత కొత్త సునీల్ కుమార్, పూర్ణిమా దంపతులు, నిర్వాహకురాలు భీశెట్టి శారద,అదిబాబు ఆళ్ల శిరీషా,డాక్టర్ బాల భార్గవి, బోర రమేష్ కృష్ణవేణి, నృత్య కళాకారిణి బోర సాహితీ పాల్గొన్నారు.



## బుజ్జిబాబు హత్య ఘటనపై ఎమ్మెల్యే వాసు ఆరా

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 6**

గోరక్షణపేటలో యువకుడు చెవ్వేటి బుజ్జిబాబు హత్య జరిగిన ప్రాంతాన్ని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. పోలీసు అధికారులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తుపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. అలాగే నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి గస్తీని మరింత ముమ్మరం చేసి, నేరస్థులపై కఠిన నిఘా కొనసాగించాలని అధికారులకు సూచించారు.



## "విధ్వంసం సృష్టించిన రోజు"

**- మానవచరిత్రలో చీకటి రోజుగా "హిరోషిమా"**

**- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి.గిరిధర్**

**ఆముదాలవలస (జయ జయహే)**

1945 ఆగష్టు 6 న ఉదయం 8:15 గంటలకు ఒక నిమిషంలో ఒక నగరం బూడిద అయిందని,ఒక క్షణంలో లక్షల కలలు కాలిపోయాయని, మానవచరిత్రలో "చీకటి రోజు"ని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు. ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రార్థన సమయంలో గిరిధర్ మాట్లాడుతూ 1918లో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిందని, ఓడిపోయిన దేశాలు పగతో రగులుతూ మళ్లీ ఆయుధాలు సమకూర్చుకున్నాయని, హిట్లర్, ముస్సోలినీ వంటి నియంతల దురహంకారం వల్ల రెండవ ప్రపంచ యుద్ధం మొదలైందని, 1945 నాటికి జర్మనీ లొంగిపోయిందని, జపాన్ కూడా ఓటమి అంచున ఉందని, కానీ అప్పుడే అమెరికా ప్రపంచానికి ఒక కొత్త "నరకాన్ని" పరిచయం చేసిందని అదే అణుబాంబు అని తెలిపారు. 1945 ఆగష్టు 6, ఉదయం 8:15 అమెరికా బి-29 విమానం "ఎనోలా గే" నుండి హిరోషిమా నగరంపై "లిటిల్ బాయ్" అనే అణుబాంబును జారవిడిచిందని, ఒక్క పేలుడుతో 60 వేల భవనాలు నేలమట్టం అయ్యాయని 1.4 లక్షల మంది మృతి చెందారని, తరువాతి నెలల్లో రేడియేషన్ తో మరో లక్ష మంది చనిపోయారన్నారు. పచ్చని చెట్లు కాలిపోయాయని, నదుల నీరు ఉడికిపోయిందని, హిరోషిమా మొత్తం ఒక పెద్ద శ్మశానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేయని నేరానికి అమాయక పిల్లలు, వృద్ధులు, మహిళలు బలయ్యారని,అది యుద్ధం కాదు, ఇది సామూహిక హింసాకాండ అని, మానవత్వమే తలదించుకున్న రోజని తెలిపారు. 3 రోజుల తర్వాత ఆగష్టు 9న నాగసాకిపై కూడా మరో బాంబు పడిందని, హిరోషిమా డే అంటే కేవలం జ్ఞాపకం కాదని, ఇది ఒక హెచ్చరిక అని తెలిపారు. హిరోషిమా మనకు చెప్తున్న సందేశం ఒక్కటేనని, యుద్ధం పరిష్కారం కాదు, శాంతి తప్ప మరో మార్గం లేదని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు విద్యార్థులు 2 నిమషాలు మౌనం వహించి నివాళులు అర్పించారు.



## కూటమి నాయకులు ఇంటింటికి అవగాహన సదస్సు కార్యక్రమం

**అరకులోయ: ఆగస్టు 06 జయ జయహే.**

అరకు వేలి మండల కేంద్రంలోని బస్కి గ్రామ పంచాయితీ లో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజాలకు అందుతున్నాయా లేదా అనేదానిపై కరపత్రాలతో ప్రజల్లోకి వెళ్లి ఇంటింటికి డోర్ టు డోర్ కూటమి నాయకులు ఈ సంక్షేమ పథకాలను అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు, తెలుగుదేశం పార్టీ ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ అరకు నియోజకవర్గ ఇన్చార్జ్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో ఈ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో పంచాయితీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎస్ బలరాం, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు సమర్థి లైసన్, ప్రధాన కార్యదర్శి ఎస్ కామేశ్వ రారావు, పంచాయతీ ఆర్గనైజర్ సెక్రటరీ వి ధర్మరాజు, పంచాయితీ యూత్ అధ్యక్షులు పాంగి రవికుమార్, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

## కొయ్యురు విద్యార్థికి హరి ఉత్సవ్ 2026లో ఘన సన్మానం

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 07,**

ఇంటర్ 2వ సంవత్సరం పరీక్షలలో కొయ్యురు బైక్ మెకానిక్ పి.రామకృష్ణ కుమారుడు కుమార్ ఇంటర్ లో 98.4 మార్కులు సాధించి అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. 1000 కి 984 మార్కులు సాధించిన కుమార్ కి విజయవాడలో జరిగిన హరి - అకాడమీ అఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవాషన్ , దీమెడీ టూ బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హరి ఉత్సవ్ 2026 - ఫ్యూచర్ లీడర్స్ " కార్యక్రమంలో కుమార్ ను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు కుమార్ కి సర్టిఫికెట్ మరియు గోల్డెన్ మెడల్ అందజేసి అభినందించారు. కుమారుడి ఘన విజయంపై పి.రామకృష్ణ సంతోషం వ్యక్తం చేస్తూ, "కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని కుమార్ నిరూపించాడు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు.కుమార్ ఈ అద్భుతమైన ఫలితంపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.



# డీఎస్సీ అవకతవకలపై విచారణ జరపాలి

## విద్యామంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

### మాజీ డిప్యూటీ సీఎం బూడి డిమాండ్

**మాడుగుల ఆగస్టు 6 జయ జయహే**

డీఎస్సీ అవకతవులపై జరపాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు , ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ ఆదేశాలు మేరకు వారి నాయకత్వంలోవిద్యార్థి,యు-వజన,సోషల్ మీడియా విభాగాల సారథ్యంలో గురువారం మాడుగుల బస్టాండ్ ఆవరణలో రిలే నిరాహారదీక్ష కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి యువజన సంఘం ప్రతినిధులకు మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. అనంతరం ముత్యాల నాయుడు మాట్లాడుతూడీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సిబిఐ విచారణ చేపట్టాలనీ డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలనీ,ఎన్నికల్లో హామీ ఇచ్చిన 3,000 నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. వారికి 26 నెలలు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.




అలాగేచదువుకుంటున్న విద్యార్థుల పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. నాలుగు రోజులపాటు నిర్వహించ తలపెట్టిన ఈ రిలే నిరాహార దీక్షల కార్యక్రమంలో భాగంగా గురువారం మాడుగుల మండలంలో గల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం శుక్రవారం చీడికాడ మండలానికి చెందిన కార్యకర్తలు, శనివారం కె.కోటపాడు మండలంకి చెందిన కార్యకర్తలు, చివరి రోజు ఆదివారందేవరాపల్లి మండలంకి చెందిన కార్యకర్తలతో పాటు నాలుగు మండలాల కేంద్రం ముఖ్య నాయకులు పాల్గొంటారని మాజీ డిప్యూటీ సీఎం బూడి తెలిపారు. కాబట్టి ఈ నాలుగు రోజుల కార్యక్రమాల్లో పార్టీకి చెందిన శ్రేణులంత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టీవి రాజారాం, మండల పార్టీ అధ్యక్షుడు వి రామధర్మజ, దేవరపల్లి పార్టీ అధ్యక్షుడు బూరే బాబురావు, సి డి సి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మాడుగుల మండల పరిషత్ ఉపాధ్యక్షులు పి విజయలక్ష్మి, కే శ్రీనివాస్, జడ్పిటిసి కె రమణమ్మ, మాడుగుల పట్టణ పార్టీ అధ్యక్షుడు బి శ్రీనివాసరావు, మాడుగుల మాజీ ఉపసర్పంచ్ ఎన్ శ్రీనివాసరావు, కే చల్లం నాయుడు, కాళ్ల అప్పలనాయుడు,నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు జడ్పిటిసిలు పార్టీ అధ్యక్షులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దళిత అమరవీరుల బాటలో పయనిద్దాం

## చుండూరు దళిత అమరవీరుల సంస్మరణ సభ

**చోడవరం, ఆగస్టు6: జయ జయహే**

దళిత అమరవీరుల బాటలో పయనించి హక్కులను నిలబెట్టుకోవాలని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ అన్నారు. గురువారం చోడవరం ద్వారక నగర్ లో చండూరు అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరు అమరవీరులతోపాటు ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు .ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 35 ఏళ్ల కిందట చుండూరు దళితుల పై జరిగిన మారణ కాండలో ఇప్పటికీ న్యాయం జరగలేదని దుయ్యబట్టారు.కింది కోర్టు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించినప్పటికీ ఈ కేసులో తగిన సాక్ష్యాలు లేవంటూ హైకోర్టు తీర్పునిచ్చి నిందితులను విడుదల చేయడం దారుణమన్నారు. అందరూ నిర్దోషిలైతే ఆ ఎనిమిది మంది దళితులను చంపింది ఎవరని ప్రశ్నించారు. ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణ లో ఉందన్నారు. నిందితులకు తగిన శిక్ష విధించి కోర్టులుపై ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో దళితవిముక్తి ప్రతినిధులు బి. సన్యాసమ్మ,కె కుమార్,యన్. వరలక్ష్మి, హుస్సేన్, బోడయ్య, ఈశ్వరి, గొల్లన్న, తారబి,పేరమ్మ, జ్యోతి, మొతి, మహేష్, అప్పయ్యమ్మ, శ్రీను, దావీద్,చిన్నారావు,భవాని, తదితరులు. తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తికి 20 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష

## పోక్సో కేసులో నిందితుడికి శిక్షతో పాటు రూ. 25వేల జరిమానా

### విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పు

**విశాఖపట్నం, ఆగష్టు 6, జయ జయహే**



బలవంతంగా మైనర్ బాలికను లాక్కెల్లి అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి 20ఏళ్ళ కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25వేల జరిమానా విధిస్తూ విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు గురువారం సంచలన తీర్పు వెల్లడించింది. ఈ తీర్పునకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడి కే.కృష్ణ కుమార్ కు 20 సం.ల కఠిన కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానా చెల్లించాలని, అందులో 20 వేలు బాధితురాలికి అందజేయాలనీ, ప్రభుత్వం నష్ట పరిహారంగా రూ. లక్ష బాధితురాలికి అందజేయాలనీ న్యాయస్థానం తీర్పులో స్పష్టం చేసింది. 2024లో గాజువాక పోలీసు స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 20న జరిగిన ఘటనలో మైనర్ బాలిక తల్లి మే 7 న ఇచ్చిన ఫిర్యాదులో తమకు ముగ్గురు కుమార్తెలు కాగా ఇద్దరికీ పెళ్లిళు అయ్యాయి. చివరి కుమార్తె అయిన పదేళ్ల బాధితురాలు 5 వ తరగతి చదువుతున్నది. నిందితుడు కే.కృష్ణ కుమార్ ( 22 ) తమ పెద్ద అల్లుడు కాగా, 2024 ఏప్రిల్ 20న నేను నా చిన్న కుమార్తె తో వారి ఇంటికి వెళ్లడం జరిగింది. అనంతరం నా చిన్న కూతురును ఇంటి బయట అరుగు పై ఉంచి, సాయంత్రం 06:30 సమయంలో నేనూ, నా పెద్ద కూతురు మార్కెట్కి వెళ్లగా, నిందితుడైన తమ అల్లుడు తమ చివరి కుమార్తె మరియు బాధితురాలును బలవంతంగా లోపలకు తీసుకు వెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డాడు, ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు, తిరిగి తమ ఇంటికి వెళ్లగా బాధితురాలికి రక్త స్రావం అవుతుండడంతో పలు ఆసుపత్రిలలో చూపి, చివరగా ఒక ప్రముఖ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, వైద్యులు పరీక్షించి మల ద్వారం గుండా లైంగిక దాడికి గురైందని తెలుపగా, బాధితురాలిని గట్టిగా అడుగగా, ఫలానా రోజున తన బావ అయిన కే.కృష్ణ కుమార్ తనపై లైంగిక దాడికి పాల్పడి, బెదిరించాడని తెలిపింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు. అనంతరం కేసు మహిళా పోలీసు స్టేషన్ తరలించి విచారణ చేశారు. గురువారం ఈ కేసులో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు వారు గాజువాక పోలీస్ స్టేషన్ కి సంబందించిన క్రైం 263 కేసు కు సంబందించిన తీర్పు వెలువరించారు.



# ఘనంగా జరిగిన అనకాపల్లి పేరుతో సినీ చిత్ర ఈవెంట్ షో

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక రావు గోపాలరావు కళాక్షేత్రంలో గత బుధవారం రాత్రి అనకాపల్లి అనే ఊరు పేరుతో ఈవెంట్ సినిమా షో ట్రైలర్ షో ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది . దీనికి ముఖ్యఅతిథిగా సినిమా యాక్టర్ క్లిష్ట పరిస్థితుల్లో ఆపదలో ఉన్న వారిని ఆదుకునే మహోన్నత వ్యక్తి సోనుసూద్ ఈవెంట్స్ షో కి ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది . ఈయనకు ఘనంగా మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో సినిమా యూనిట్ వారు మరియు అభిమానులు ఘనంగా స్వాగతం పలకడం జరిగింది అలాగే ఈ సినిమా సంబంధించిన నిర్మాతలు ప్రొడ్యూసర్స్ మరియు హీరో హీరోయిన్స్ విలన్ క్యారెక్టర్ యూనిట్ సిబ్బంది ఈ ఈవెంట్ షోలో పాల్గొని ప్రజలతో అభిమానులతో మమేకమై ఈ సినిమా ఈవెంట్ షో ఎలా ఉన్నదని అభిమానులు అడిగి తెలుసుకోవడం జరిగింది . అభిమానులు అనకాపల్లి పేరుతో వచ్చిన ఈవెంట్ సినిమా షో పాటలు చాలా బాగున్నాయి అని కథ కూడా బాగానే ఉన్నదని అభిమానుల పేర్కొన్నారు ఈనెల 7వ తేదీన ఈ సినిమా రిలీజ్ కాబోతున్నదని నిర్మాత కాండ్రేగుల నాయుడు తెలపడం జరిగింది . ఈ సినిమాను ఆదరించి విజయవంతం చేయాలని అభిమానులకు ఆయన పిలుపునివ్వడం జరిగింది . ఈ సినిమా షూటింగ్ అంతా 90% అనకాపల్లి జిల్లా చుట్టుపక్క ప్రాంతాలను చిత్రీకరించడం జరిగిందని అలాగే ఈ సినిమా దర్శకులు నక్కి త్రినాధ్ మాట్లాడుతూ ఈ సినిమా తీసిన వాళ్ళు అనకాపల్లి వారేనని ఈ సినిమా మొదటి షో చూసేందుకు అభిమానులతో పాటు మేము కూడా హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినిమా యూనిటీ సిబ్బందికి అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి రత్నాకర్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ప్రముఖ వ్యాపారవేత్త కర్రీ సన్యాసినాయుడు జనసేన నాయకులు శ్రీరామ్ వీరందరికీ నూకాంబిక అమ్మవారు చిత్రపటాన్ని బహుకరించి సాలువాతో సత్కరించడం జరిగింది ఈ చిత్రం ప్రీ రిలీజ్ ట్రైలర్ చూసేందుకు అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొనడం జరిగింది



# నాయుడుపేట సెజ్‌లో రూ.3,000 కోట్ల భారీ పెట్టుబడి

## త్వరలో ఏడు గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంట్ ప్రారంభం: జిల్లా కలెక్టర్

**తిరుపతి,ఆగస్టు 06,జయ జయహే.**

తిరుపతి జిల్లా నాయుడుపేట సెజ్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ రూ.3,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఏడు గిగావాట్ల సోలార్ సెల్ తయారీ ప్లాంట్ త్వరలో ఉత్పత్తి ప్రారంభించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.సంస్థ ప్రతినిధులు గురువారం కలెక్టర్‌ను కలిసి ప్లాంట్ నిర్మాణ పురోగతిని వివరించారు. ఇప్పటివరకు సుమారు రూ.3,000 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు, నిర్మాణ దశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 4,500 మందికి ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. ఇటీవల విద్యుత్ సరఫరా అందడంతో ఇన్‌స్టలేషన్, కమిషనింగ్ పనులు వేగవంతమయ్యాయని, మరో రెండు నెలల్లో ప్లాంట్‌ను ఉత్పత్తికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత 3,000 మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయని, స్థానిక నైపుణ్యం కలిగిన యువతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ పేర్కొంది. ఉద్యోగుల కోసం ఓజిలి మండలం అత్తివరం గ్రామంలో అందుబాటు ధరలో గృహాల నిర్మాణం కూడా చేపడుతున్నట్లు వెల్లడించింది.ఈ సందర్భంగా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు తిరుపతి జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.



# ఆనందగిరి ఆలయానికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మురళీమోహన్

**పూతలపట్టు,ఆగస్టు 6, జయ జయహే.**

పాకాల మండలం ఊ ట్లవారిపల్లి క్షేత్రంలో వెలసి ఉన్న సుబ్రమణ్య స్వామి దేవస్థానం 78వ ఆడికృత్తికబ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుండి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మహిళ మోహన్ పట్టు వస్త్రాలు సమర్పించారు.ఎమ్మెల్యే మురళీ మోహన్ సుప్రసిద్ధ కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుండి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను సుబ్రహ్మణ్య స్వామి కి అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాననీ పాకం ఈవో పెంచల కిషోర్, చైర్మన్ మణి నాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే నాని, తెలుగుదేశం నాయకులు జయ చంద్ర చౌదరి, తదితరులు పాల్గొన్నారు . ఆలయ అధికారులు పాల్గొన్నారు.




# శ్రీవ్యాసాశ్రమ అవినీతిపై సమగ్ర విచారణకు డిమాండ్

## జిల్లా కలెక్టరు, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన నేతలు.

**శ్రీకాళహస్తి, ఆగస్టు 06,జయ జయహే.**

ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక సంస్థను పరిరక్షించాలని ధర్మాన్ని కాపాడాలనే సంకల్పంతో, సనాతన ధర్మంలో భాగంగానే శ్రీవ్యాసాశ్రమం పూర్వ వైభవం కోసం సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టరు, ఎస్పీ లను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ కలెక్టర్ ను ఎస్పీలను కోరారు. గురువారం తిరుపతి కలెక్టర్ సమావేశంలో వారు కోరారు. ఆశ్రమం పై అనేక ఆరోపణలు, వివాదాలు వినిపించడం ప్రతి భక్తుని హృదయాన్ని కలచివేస్తోందని ఎమ్మెల్యేసుధీర్ రెడ్డి కలెక్టర్ వెంకటేశ్వర్ కు తెలిపారు.ఆశ్రమ నిర్వహణకు సంబంధించి పీఠాధిపతి, వారి తమ్ముడు శివరాంరెడ్డి, నెల్లూరు నుంచి వచ్చిన అమర్నాథ్ రెడ్డి పాత్రపై అనేక ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.ఈ విషయాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయని అందువల్ల ఈ అంశాలపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా "సమగ్ర విచారణ" జరగడం అత్యంత అవసరమని, ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సుధీర్ రెడ్డి, కోలా ఆనంద్లు కోరారు.

# పవన్ దృష్టికి జానకిరాంపురం సమస్యలు

**చోడవరం ఆగస్టు 6 జయ జయహే**

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి జానకి రాంపురం సమస్యలు తీసుకెళ్లి'వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి పి వి ఎస్ ఎన్ రాజు చెప్పారు. జనసేన పార్టీ నిర్వహిస్తున్న మన గ్రామం -- మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా గురువారం రోలుగుంట మండలం జానకిరాంపురం గ్రామంలో అయన పార్టీ నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చదువుతున్న చిన్నారులను, వారి తల్లిదండ్రులను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ భవనానికి రక్షణ కోసం కాంపౌండ్ వాల్ నిర్మాణం అత్యవసరమని స్థానిక నాయకులు వినతి చేయగా, ఈ అంశాన్ని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి



పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం గ్రామంలోని పలువురు రైతులు, ప్రజలను కలిసి వారి సమ-స్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు జానకిరాంపురం నుండి అనిమిరెడ్డి వారి చెరువు వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ రహదారి నిర్మాణం జరిగితే వందలాది మంది రైతులకు తమ వ్యవసాయ భూములకు రాకపోకలు సులభమవుతాయని వివరించారు.అలాగే జానకిరాంపురం నుండి కాముడుపాలెం వరకు రహదారి నిర్మాణం కూడా అత్యంత అవసరమని, ఈ మార్గం వెంబడి అనేక మంది రైతుల వ్యవసాయ భూములు ఉన్నందున వెంటనే రహదారి నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.ఈ రెండు రహదారుల నిర్మాణ అవసరాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత శాఖల ద్వారా వీలైనంత త్వరగా నిర్మాణ పనులు చేపట్టేలా కృషి చేస్తానని పివిఎస్ఎన్ రాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో రోలుగుంట మండల జనసేన పార్టీ అధ్యక్షులు బలిజ మహారాజ్, కుశర్లపూడి మాజీ సర్పంచ్ గండి తాతాజీ, స్థానిక నాయకులు అదపురెడ్డి చిరంజీవి, దేవాడ రామకృష్ణ, దేవాడ రమణ తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com